

www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 12 మే 2021 | సంపుటి : 02 | సంచిక :300 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## రిజర్వేషన్ కోటాపై మోదీకి ఉద్ధవ్ విజ్ఞప్తి

ముంబై: మరాఠా సామాజిక వర్గాన్ని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజివర్గం (సోషల్లీ అండ్ ఎడ్యూకేషనల్లీ బ్యాక్వర్డ్ క్లాస్) కింద పరిగణించి వారికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే కోరారు. మంగళవారం ప్రధానికి రాసిన లేఖలో మరాఠా రిజర్వేషన్‌పై కోటాపై ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.మరాఠాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తూ కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. రిజర్వేషన్ కోటా 50 శాతం మించకూడదనే నిబంధనకు ఇది వ్యతిరేకంగా ఉందని, అంతే కాకుండా ఇలాంటి చట్టాలు చేసే అధికారం ప్రధానికి రాష్ట్రపతికి మాత్రమే ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే మరాఠాలకు రిజర్వేషన్లు సాధించే వరకు చట్టబద్ధమైన పోరాటం కొనసాగిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే.. సుప్రీం తీర్పును దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

# తిరుపతి రుయా ఘటన తీవ్రంగా కలచివేసింది: సీఎం జగన్

**మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం**

**ఆక్సిజన్ విషయంలో కలెక్టర్లందరూ అప్రమత్తతతో వ్యవహరించాలి**

**స్పందనపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్**

**కరోనా కట్టడి చర్యలపై కలెక్టర్లకు సీఎం జగన్ దిశానిర్దేశం**



అమరావతి: స్పందనలో భాగంగా జిల్లా కలెక్టర్లతో తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా కట్టడి చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. కోవిడ్, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జలకళ, వైఎస్సార్ అర్బన్ క్లినిక్స్, హౌసింగ్, స్పందనకు వచ్చిన వినతులు, ఖరీఫ్‌కు సన్నద్ధతపై సీఎం సమీక్షించారు.కోవిడ్‌తో కలిసి జీవించాల్సిన పరిస్థితుల్లో ఉన్నామని సీఎం వైఎస్ జగన్ అన్నారు. బాధాకరమైన ఘటనలు కూడా జరుగుతున్నాయని.. నిన్న రుయా ఆస్పత్రిలో జరిగిన ఘటన తీవ్రంగా కలచి వేసిందన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని సీఎం ప్రకటించారు. మనం ఎంత కష్టపడుతున్నా, ప్రయత్నాలు చేస్తున్నా కూడా కొన్ని కొన్ని మన చేతుల్లో లేని అంశాలకు కూడా మనం బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు."తమిళనాడు నుంచి రావాల్సిన ఆక్సిజన్ ట్యాంకర్ సరైన సమయానికి రాలేకపోయినందున, ఆక్సిజన్ కొరత ఏర్పడిందని.. 11 మంది చనిపోయారని అధికారులు చెప్పారు. ఆక్సిజన్ పరిస్థితి ఏ స్థాయిలో ఉందంటే నిన్నకూడా ఆరు ట్యాంకర్లను గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి ఒడిశాకు విమానంలో పంపాం. రవాణా సమయాన్ని ఆదా చేయడానికి ఎయిర్ లిఫ్ట్ చేశాం. అక్కడ నింపి... రోడ్డు మార్గంలో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. విదేశాల్లో కూడా ఆక్సిజన్ కొనుగోలు చేసి షిప్స్ ద్వారా తెప్పిస్తున్నాం. ఇన్నిరకాలుగా ఆక్సిజన్ కొరత రాకుండా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇన్ని ప్రయత్నాలు చేస్తున్న కూడా కొన్ని కొన్ని మన చేతుల్లో లేకపోవడంవల్ల నష్టాలు జరుగుతున్నాయి. కలెక్టర్లందరికీ కూడా చెప్తున్నా... చాలా అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇంకా మానవత్వం చూపించాల్సిన అవసరం ఉంది. కోవిడ్ కారణంగా నెలకొన్న సమస్యలను మానవత్వంతో ఎదుర్కోవాల్సి ఉందనివవ సీఎం అన్నారు."18 ఏళ్లకు పైబడ్డ వారికి వ్యాక్సిన్ ఇవ్వడానికి 172 కోట్ల డోసులు దేశానికి అవసరమైతే ఇప్పటి వరకూ కేవలం 17 కోట్లు డోసులు మాత్రమే ఉత్పత్తి అయిన పరిస్థితి కనిపిస్తోంది. 45 సంవత్సరాలు పైచిలుకు ఉన్నవారు రాష్ట్రంలో 1.48 కోట్ల మంది ఉన్నారు. వీరికి 2 డోసులు చొప్పున దాదాపు 3 కోట్లు డోసులు ఇవ్వాలి. 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉన్న వారు రాష్ట్రంలో 2 కోట్ల మంది జనాభా సుమారుగా ఉన్నారు. వీరికి దాదాపు 4 కోట్ల డోసులు అవసరం. అంటే 18 ఏళ్ల పైబడి రాష్ట్రంలో ఉన్నవారికి వ్యాక్సిన్లు ఇవ్వాలంటే దాదాపు 7 కోట్ల డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ 73 లక్షల డోసులు మాత్రమే కేంద్రం నుంచి మనకు అందాయి. ఈ పరిస్థితి ఉందని అందరికీ తెలుసు.డబ్బులు తీసుకుని మాకు సప్లైచేయండని కోరినా సరే కంపెనీలు తీసుకోవడం లేదు. వ్యాక్సిన్ల పంపిణీ అన్నది కేంద్రం నియంత్రణలో ఉంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో కేంద్రం కూడా అఫిడవిట్‌లో దాఖలు చేసింది. జనాభా ప్రాతిపదికన కోటాను నిర్ధారిస్తామని అఫిడవిట్‌లో పేర్కొంది. ఇలాంటి పరిస్థితి ఉండి కూడా చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 లాంటి వాళ్లు చేస్తున్న ప్రచారాలు ఒక్కసారి చూడండి. వ్యాక్సిన్లకు కేవలం రూ.45 కోట్లు మాత్రమే ఇచ్చారు. రూ.1600 కోట్లు ఇవ్వలేరా? కమీషన్లు కోసం చూస్తున్నారు? అని ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్షం మాట్లాడుతున్న ఈ మాటలను పతాక




శీర్షికల్లో ఈనాడు లాంటివి వేస్తున్నాయి. ప్రజల్లో అలజడిని రేకెత్తించడానికి, భయాందోళనలు సృష్టించడానికి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనివవ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు."టియర్ -1 సిటీస్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలు లేకపోయినా దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య సేవలు అదించగలుగుతున్నాం. మరణాల రేటు పరిశీలిస్తే చాలా రా(ష్టాలతో పోలిస్తే చాలా మెరుగ్గా ఉన్నాం. కలెక్టర్ల స్థాయి నుంచి ఆశా వర్కర్, వాలంటీర్ స్థాయి వరకూ ఎంతో కమిట్‌మెంట్‌గా చిత్త శుద్ధితో పనిచేస్తున్నాం. అయినా సరే కొన్ని కొన్ని ఘటనలు జరుగుతున్నాయి. అయినా సరే.. మరింత సమర్థవంతంగా, మానవత్వంగా, సానుభూతి చూపించి పనిచేద్దాం. జీర్ణించుకోలేని పరిస్థితుల్లో కొందరు రాజకీయ నాయకులు, ఎల్లోమీడియా ఉంది.

# తెలంగాణలో నేటి నుంచి లాక్‌డౌన్

**పది రోజుల పాటు లాక్‌డౌన్ అమలు**

**వ్యాక్సినేషన్‌పై కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం**


**మద్యం హోం డెలివరీకి అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ**



హైదరాబాద్: రాష్ట్రంలో రోజు రోజుకు కరోనా కేసులు భారీగా పెరిగిపోతున్నాయి. కోవిడ్ కట్టడి కోసం రాత్రి కర్ఫ్యూ విధించినప్పటికి మహమ్మారి అదుపులోకి రావడం లేదు. తెలంగాణ హైకోర్టుతో సహా పలు సంస్థలు లాక్‌డౌన్ విధించిడమే సరైన మార్గం అంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించేందుకు ప్రభుత్వం నిర్ణయించుకుంది. మే 12, బుధవారం ఉదయం 10 గంటలనుంచి పదిరోజుల పాటు రాష్ట్రంలో సంపూర్ణ లాక్‌డౌన్ అమల్లోకి రానుంది. కేబినెట్ భేటీలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిత్యవసరాలకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. టీకా కొనుగోలు కొరకు గ్లోబల్ టెండర్లను పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై హైకోర్టు అత్యవసర విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు తగ్గిండంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదేశాలు బేఖాతరు చేస్తే కోర్టు ధిక్కారణ నోటీసులు ఇస్తామని హెచ్చరించింది. అదే విధంగా.. సరిహద్దుల్లో అంబులెన్స్‌లను ఎందుకు అడ్డుకుంటున్నారని కేసీఆర్ సర్కారును ప్రశ్నించింది. ఇక పాతబస్తీలో కోవిడ్ నిబంధనలు పాటించడం లేదన్న న్యాయస్థానం.. లాక్‌డౌన్ విధిస్తారా లేదా నిబంధనలు కఠినతరం చేస్తారో చెప్పండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పది రోజుల పాటు లాక్‌డౌన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

# యజ్ఞంలా సాగుతోన్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణపు పనులు

పశ్చిమ గోదావరి: ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. చంద్రబాబు పాలనలో జరిగిన వైఫల్యాలు, లోపాలు, అక్రమాలు-అవకతవకలు సరిచేస్తూనే సీఎం వైఎస్ జగన్ సర్కారు ముందుకు దూసుకెళ్తోంది. అందులో భాగంగా పోలవరం ప్రాజెక్టును ఓ యజ్ఞం చేపడుతోంది. వేలాది మంది కార్మికుల శ్రమైక్య సౌందర్యంతో పాటు ఆధునిక యంత్ర సామాగ్రి, వేలాది టిప్పర్లు,లారీలు,యంత్రాల రణగొణ ధ్వనుల మధ్య ఓ ప్రపంచ అద్భుత నిర్మాణంగా పోలవరం ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. వందలాది మంది నిపుణులు,ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు పరుగులు పెడుతున్నాయి.గత



ప్రభుత్వాలు మాటలకు, గ్రాఫిక్స్ కే పరిమితమైతే , జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం గత రెండేళ్ళుగా చేతల్లో చూపిస్తున్నారు. వరదలు వచ్చినా, కరోనా కలవర పెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ పనులు మాత్రం రెట్టింపు వేగంతో కొనసాగుతున్నాయి. మేఘా ఇంజనీరింగ్ సంస్థ పక్కా ప్రణాళికకు తోడు రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల సహకారంతో నిర్మాణం అంచనాలను తలకిందులు చేస్తూ యుద్ధప్రాతిపతికన పనులు జరుగుతున్నాయి. చంద్రబాబు పోలవరాన్ని సోమవరంగా మార్చాను అని మొండి గోడలకు పరిమితం చేస్తే, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఆంధ్రుల జీవనాడి తమ లక్ష్యంగా పనులు చేయిస్తోంది.పోలవరం ప్రాజెక్ట్ లో అంచనాలను మించి పనులు జరుగుతున్నాయి. గత ఏడాది కాలంలో అంటే ఏప్రిల్ 2020 నుంచి 21 మార్చివరకు 12 నెలల కాలంలో 4,03,160 ఘనపు మీటర్ల కాంక్రీట్ పనిని ప్రభుత్వం ప్రతిపాదిస్తే మేఘా ఇంజనీరింగ్ 5,58,073 ఘనపు మీటర్ల కాంక్రీట్ పనిని చేసి సత్తాచాటింది. గత ఏడాది మే, జూన్, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలలో ఇంజనీరింగ్ నిపుణులు సైతం నివ్వెరపోయే విధంగా కాంక్రీట్ పని చేపట్టింది. గత సంవత్సరంలో మే నెలలో కరోనాను తట్టుకొని 53 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 85,300 క్యూబిక్ మీటర్ల పనిని పూర్తి చేసింది.అలాగే జూన్-2020లో 70 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే రికార్డు స్థాయిలో 1,20,100 క్యూబిక్ మీటర్ల పూర్తి చేసింది. అదేవిధంగా ఫిబ్రవరి 2021లో 47 వేల క్యూబిక్ మీటర్లు కాంక్రీట్ పనులు చేయాలని టార్గెట్ పెట్టుకుని 83 వేల క్యూబిక్ మీటర్ల పనులు చేసింది.

# ఏపీలో కొత్తగా 20,345 కరోనా కేసులు

అమరావతి: ఏపీలో గత 24 గంటల్లో 86,878 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, కొత్తగా 20,345 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.గత 24 గంటల్లో కరోనా వైరస్ బారినపడి చిత్తూరు జిల్లాలో 18, విశాఖ జిల్లాలో 12, తూర్పు గోదావరి, గుంటూరు, విజయనగరం జిల్లాల్లో 10 మంది చొప్పున.. ప్రకాశం జిల్లాలో 9, నెల్లూరు జిల్లాలో 8, కృష్ణా జిల్లాలో ఏడుగురు, శ్రీకాకుళం జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఐదుగురు చొప్పున మృతి చెందారు. వైఎస్సార్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. మొత్తం 108 మంది మరణించారు.రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనాతో 8,899 మంది మృతి చెందారు.గత 24 గంటల్లో 14,502 మంది డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 11 లక్షల 18 వేల 933 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఏపీలో ప్రస్తుతం 1,95,102 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఏపీలో ఇప్పటివరకు 1,75,14,937 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.



# అఖిలపక్షం ఏర్పాటు చేయండి : చంద్రబాబు డిమాండ్

అమరావతి : ఏపీలోని ప్రస్తుత పరిస్థితులపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ నేతలు, మండలాధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా బాధితులకు ఇచ్చిన సాయం, తదితర వివరాలపై జగన్ సర్కార్



వెంటనే ఓ శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు డిమాండ్ చేశారు. కరోనా కట్టడి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించడానికి ప్రభుత్వం వెంటనే అఖిలపక్షాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆక్సిజన్ అందక మరణించిన వారి సంఖ్య విషయంలో, కరోనా మృతులకు సాయం చేసిన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా వ్యాక్సిన్‌ను అందరికీ వేసేట్లుగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా మృతుల దహన సంస్కారాలకు 15 వేల రూపాయల సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ అది అమలు కావడం లేదని మండిపడ్డారు. కరోనా మృతులకు గౌరవ ప్రదంగా ప్రభుత్వమే దహన సంస్కారాలను నిర్వహించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఆక్సిజన్ అందక మృతి చెందిన కుటుంబాలకు 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయాలని, ఇతర కారణాల రీత్యా మరణించిన కరోనా రోగుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా కరోనా కారణంగా పనులు కోల్పోయిన ప్రైవేటు ఉపాధ్యాయులకు, భవన నిర్మాణ కార్మికులకు, పేదలకు 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇంతటి కష్ట కాలంలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కరోనా మందులు, ఆక్సిజన్ సరఫరా, ఆస్పత్రుల్లో బెడ్ల కేటాయింపుల్లో బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దక్షిణాదిలోని అన్ని రా(ష్టాల్లో లాక్‌డౌన్ విధించారని, ఏపీలో మద్యం అమ్ముకోవడం కోసమే లాక్‌డౌన్ విధించడం లేదని చంద్రబాబు విమర్శించారు.

# సీఎం ఒక్కరోజు కమీషన్‌తో రా(ష్టానికి సరిపడా వ్యాక్సిన్ కొనొచ్చు: నిమ్మల




అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిర్లక్ష్యం, ప్రణాళికా లోపంవల్ల.. ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారని టీడీపీ ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరోసభ్యుడు నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సీఎం తన సమయాన్ని ప్రతిపలపై.. కేసులు పెట్టడంపై కాకుండా ప్రజారోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఒక్కరోజు కమీషన్‌తో రా(ష్టానికి సరిపడా వ్యాక్సిన్ కొనొచ్చునని, జగన్ ఒక్కరోజు అవినీతి సంపాదనతో.. రాష్ట్రంలోని కొవిడ్ రోగులందరినీ కాపాడవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. అనేక రా(ష్టాలు, అక్కడి ప్రభుత్వాలు వ్యాక్సిన్లు కొని ప్రజలకు పంచుతున్నాయని, అక్కడి ప్రతిపక్షనేతలెవరూ ఆ పనిచేయలేదన్న విషయం సీఎం జగన్ గ్రహించాలని రామానాయుడు అన్నారు.

# ప్రధాని మోదీకి సీఎం జగన్ లేఖ

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం లేఖ రాశారు. ఆక్సిజన్ కేటాయింపులు, సరఫరాపై లేఖలో ప్రస్తావించారు. ఏపీకి 910 మెట్రిక్ టన్నుల లిక్విడ్ ఆక్సిజెన్ సరఫరా చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం 590 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ సరఫరా చేస్తున్న అది ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. 20 ఆక్సిజన్ ట్యాంకర్లను ఏపికి మంజూరు చేయాలని కోరారు. తమిళనాడు, కర్ణాటక నుంచి ఆక్సిజన్ దిగుమతి చేసుకుంటున్నామని అది సరిపోవడం లేదన్నారు. మోదీకి జగన్ రాసిన లేఖలోని అంశాలను పరిశీలిస్తే..

ఈనెల 10న చెన్నై, కర్ణాటక నుంచి రావాల్సిన ఆక్సిజన్ ఆలస్యమైంది. ఆక్సిజన్ రావడం ఆలస్యమవ్వడంతో తిరుపతిలో 11 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్న...20 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను 150 మెట్రిక్ టన్నులకు పెంచాలని లేఖలో ప్రస్తావించారు.

ప్రస్తుతం ఒడిశా నుంచి దిగుమతి చేసుకుంటున్న...210 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను 400 మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు.

భారత్ బయోటెక్ కోవాగ్జిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు... టెక్నాలజీ బదిలీ అంశాన్ని పరిశీలించాలని లేఖలో తెలిపారు.

పెద్ద మొత్తంలో వ్యాక్సిన్ ఉత్పత్తి చేయాలంటే టెక్నాలజీ బదిలీ తప్పనిసరి. వ్యాక్సిన్ ఉత్పత్తికి సంబంధించి...ఐసీఎంఆర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలు సహకరించాయి

# సంపాదకీయం

బుధవారం 12 మే 2021

## రసవత్తరంగా రాజకీయ క్రీడ

ముందుగానే చెప్పేశాం.. ఇప్పుడు ఇదో పెద్ద ఊత పదం. కరోనా సెకండ్ వేవ్ గురించి కేంద్రం రాష్ట్రాలకు ముందుగానే చెప్పేసింది. రాష్ట్రాలు ప్రజలనూ అప్రమత్తంగా ఉండమని చెప్పేశాయి. అసలు అంతర్జాతీయ పత్రికలు భారత్ నూ ఎప్పుడో హెచ్చరించేశాయి. అయినా కరోనా వచ్చి పడిపోయింది. ఎవరిది తప్పు. మీ ఖర్మకు మీరే బాధ్యులన్నట్లుగా తప్పించుకుంటున్నాయి సర్కారులు. కట్టడి చేయాల్సిన యంత్రాంగాలు, అప్రమత్తం చేయాల్సిన అంతర్జాతీయ సమాజం అంతా తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినట్లు చెప్పుకుంటున్నాయి. పెద్దవాళ్లు చిన్నవాళ్లను, వారు మరింత చిన్నవాళ్లను మందలించి తమ పెద్దరికం నిలబెట్టుకుంటున్నట్టుంది. అంతర్జాతీయ సమాజం భారత్ ను దోషిగా చూపిస్తోంది. కేంద్రం రాష్ట్రాలను దోషులుగా నిలబెదుతోంది. రాష్ట్రాలు ప్రజలపైనే తోసేస్తున్నాయి. వీలయితే బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నచోట్ల కేంద్రంతో దెబ్బలాటకు దిగుతున్నాయి. అసలు వాస్తవమేమిటన్నది అంతుచిక్కకుండా ప్రభుత్వాలు రాజకీయ క్రీడ రసవత్తరంగా సాగిస్తున్నాయి.ప్రపంచంలో ఏ వింత చోటు చేసుకున్నా నోస్ట్రాడామస్ ఎప్పుడో చెప్పేశారంటూ గొప్పగా చెప్పడం అంతర్జాతీయ సమాజానికి అలవాటు. అలాగే ఎపుడో చెప్పెను బ్రహ్మంగారు అంటూ మనమూ సాగదీస్తుంటాం. కొంచెం సంప్రదాయవాదులైతే ఇవన్నీ మన వేదాల్లోనే ఉన్నాయిష అంటూ గట్టిగా నొక్కి చెప్పేస్తుంటారు. నిజానికి కాలజ్ఞానులు అంటూ ఎవరూ ఉండరు. అప్పుడు సాగుతున్న పరిణామ క్రమం, గతం నుంచి అప్పటివరకూ చోటు చేసుకున్న పరిణామాలను బేరీజు వేస్తూ భవిష్యత్తును ఊహిస్తుంటారు కొందరు. అప్పటి కాలానికి అది వింతగా ఉంటుంది. తర్వాత వారు ఊహించిన సంఘటనల తాలూకు చాయలు కనిపిస్తే, రకరకాల నిర్వచనాలతో ఆ మాటలకు సాధికారత కల్పిస్తుంటుంది సమాజం. అదే కాలజ్ఞానం. ఈ నిర్వచన కారుల సిద్ధాంతాల ఆధారంగానే నోస్ట్రడామస్ అయినా బ్రహ్మం గారు అయినా పాపులర్; ఫేమస్ అయ్యారు. ఇప్పుడు కరోనాను అదే కోవలో పెట్టుకోవాల్సి వస్తోంది.రిపబ్లిక్ డే, ఆగస్టు పదిహేను వస్తున్నపుడు ఏదో జరగబోతోందంటూ అన్ని రాష్ట్రాలకు కేంద్ర ఇంటిలిజెన్సు? రొటీన్ గా హెచ్చరికలు పంపేస్తూ ఉంటుంది. అందులో స్పెసిఫిక్ ఇన్ఫర్మేషన్ ఏమీ ఉండదు. ఎక్కడ, ఏం జరగనుందో , ఎవరు అందుకు తలపెడుతున్నారో కూడా వివరాలుండవు. ఒకవేళ ఏదైనా జరిగితే మేం ముందుగానే చెప్పేశాం. అయినా అప్రమత్తం కాలేదంటారు. ఏమీ జరగకపోతే అసలు ఎవరూ పట్టించుకోరు. ఇప్పుడు కేంద్రం వైఖరి కూడా అదే. ఫిబ్రవరిలోనే కరోనా సెకండ్ వేవ్ పై హెచ్చరికలు జారీ చేశామని కేంద్రం సన్నాయి నొక్కులు నొక్కుతోంది. కేంద్రం ఈ తీవ్రతను ముందుగానే గుర్తిస్తే అయిదు రాష్ట్రాల ఎన్నికలు వద్దని ఎన్నికల సంఘానికి ఎందుకు చెప్పలేదు. కుంభమేళాకు అనుమతులు ఎందుకు ఇచ్చినట్లు? అది గాలివాటం సమాచారం. ఉత్తుత్తి హెచ్చరికే. సీరియస్ గా పరిస్థితి ఇలా ఉండబోతోందని అప్రమత్తం చేయలేదు. అలాగే ఇప్పుడు బారత్ ను తప్పుపడుతున్న అంతర్జాతీయ సమాజమూ దొంగాటే ఆడుతోంది. గడచిన అక్టోబర్, నవంబర్ నెలల నాటికి బారత్ అల్లకల్లోలం అయిపోతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరించారు. అప్పటికి అసలు కేసులు పెద్దగా రావడం మానేశాయి. ఇప్పుడు కేసులు పెరిగాయి కాబట్టి వేలెత్తి చూపే అవకాశం దొరికింది. అంతర్జాతీయ పత్రికలు, నిపుణులు దొరికింది చాన్సంటూ విరుచుకుపడుతున్నారు. రాజకీయ విమర్శలు చేస్తూ భారత్ ను నిందిస్తున్నారు. అంతే తప్ప గతంలో వారిచ్చిన సమాచారానికి సాధికారత ఉండి కాదు.నిపుణుల ముసుగులో పాపులారిటీ కి పాకులాడే మేధావులు తయారయ్యారు. వచ్చే అక్టోబర్ లో కరోనా మూడో వేవ్ వస్తుంది. అది 18 సంవత్సరాల లోపు వారిపై విరుచుకుపడుతుందంటూ ప్రచారం మొదలు పెట్టారు. తాము పరిశోధన చేసి కొత్త విషయాన్ని కనిపెట్టినట్లు చెబుతున్నారు. నిజంగానే కరోనా మరోసారి విజృంభిస్తే అప్పటికి ఇంకా టీకాల పరిధిలోకి రాని 18 సంవత్సరాల లోపు వారు ప్రమాదం ముంగిట్లో ఉంటారు. అది సాధారణ విషయం. దానికి పెద్ద పరిశోధన చేసి కనిపెట్టాల్సింది ఏమీ లేదు. నిపుణులే చెప్పాల్సిన అవసరమూ లేదు. కామన్ మేన్ ను అడిగినా చెబుతారు. రక్షణ టీకా వేసుకోలేదు కాబట్టి సహజంగానే కరోనాకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రొటీన్ విషయాలనే నిపుణుల పేరిట ప్రచారంలోకి తెస్తూ భయాందోళనలు రేకెత్తి స్తున్నారుట్రీట్ మెంట్ ప్రొటోకాల్ దేశంలో ఇంకా గందరగోళంగానే ఉంది. డాక్టర్ల పేరుతో ఎవరికి తోచింది వారు చెప్పేస్తున్నారు. నిన్నామొన్నటివరకూ ఆవిరి పట్టండి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తాజాగా ఆవిరిపడితే ప్రమాదమని ఒకవర్గం డాక్టర్లు ప్రజలను భయపెడుతున్నారు. మన వంటింటి దినుసులే రక్షణ. వాటిని విస్తృతంగా వినియోగించండి అంటూ చాలా మంది పేరు గొప్ప డాక్టర్లు ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడేమో అతిగా వాడితే కడుపుకు సంబంధించి కాన్సర్లు వంటివి వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. సీటీ స్కాన్ తీసుకుంటే రోగం బయటపడిపోతుందని ఒక విశ్వాసం కలిగించారు. ఇప్పుడు దాని జోలికివెళ్లవద్దంటున్నారు. రెమ్ డెసివర్ వినియోగం మొదలు అసలు ప్రజలేం చేయాలనేదానిపై ఒక స్పష్టత లేదు. ముందుగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ప్రొటోకాల్ ప్రకటించి ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది. లేకపోతే చెట్టుకింది డాక్టర్లు చెప్పిందల్లా ప్రజలు చేసుకుంటూ పోతున్నారు. ప్రాణాలు గాలిలో దీపంగా మారుతున్నాయి. కరోనా సెకండ్ వేవ్ లో అత్యధిక ప్రాణ నష్టానికి కారణం కరోనా కాదు,

# రుయా ఘటనపై సర్వత్రా నిరసనలు

**11మందిని మించే చనిపోయి ఉంటారని ఆరోపణలు**

**ఆస్పత్రి వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు**

**ఘటనపై గవర్నర్ దిగ్భ్రాంతి**

తిరుపతి,మే11( తిరుపతి రుయా ఆసుపత్రిలో దారుణం చోటు చేసుకున్న ఘటనపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శలు వెల్లువెత్తాయి. ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక నిమిషాల వ్యవధిలోనే 11 మంది మృతి చెందారు. దీంతో ప్రస్తుతం రుయాకు సంబంధించి మరికొన్ని సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. చనిపోయింది 11 మంది కాదని.. మొత్తం 29 మంది అని తెలుస్తోంది. మృతి చెందిన 11మంది బెడ్స్‌తో పాటు తమతో వైద్యం తీసుకుంటున్న మరో 18 మంది బెడ్స్ కూడా ఖాళీగా ఉండటంతో వారంతా మరణించి ఉంటారని రోగులు చెబుతున్నారు. రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 11 మంది కోవిడ్ బాధితులు మృతి చెందిన ఘటన పట్ల గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను గవర్నర్ ఆదేశించారు. ప్రస్తుతం రుయాలో ఒకే ఒక్క జూనియర్ డాక్టర్ ఉన్నారు. బాధితులందరికీ ఆయన ఒక్కరే వైద్యం అందిస్తున్నారు. ఆయనను బాధితుల బంధువులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కనీసం దూది కూడా లేదు. పేపర్‌తో రక్తం తుడుస్తున్నారు. సర్జికల్ గ్లోవ్ లేదు. షుగర్ స్ట్రిప్‌లు లేవు. మందులు లేవు. లోపల పరిస్థితిపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన వైద్యులు సైతం వచ్చి తమకు చికిత్సను అందించాలని కోరుతున్నారు. ప్రాణాలు పట్టి నిలిపే ఆక్సిజన్ అందక...11 మంది కొవిడ్ బాధితులు ఆస్పత్రి పడకలపైనే ఆఖరి శ్వాస వదిలారు. మృతుల సంఖ్య మరింత ఎక్కువగానే ఉండొచ్చునని తెలుస్తోంది. కనీసం పాతిక మంది చనిపోయి ఉంటారని వివిధ వర్గాలు 'అనధికారికంగా' చెబుతున్నాయి. ఉత్తమ సేవలతో ప్రాణదాతగా పేరుపొందిన తిరుపతిలోని రుయా ఆస్పత్రిలోనే ఈ విషాదం చోటు చేసుకుంది. రుయా ఆస్పత్రిలోని కొవిడ్ వార్డుల్లో ఆక్సిజన్ సరఫరా ఆగిపోవడంతో పరిస్థితి భయానకంగా తయారైంది. ఎటు చూసినా బెడ్లపై అచేతనంగా పడి ఉన్న బాధితులు, శ్వాసకోసం ఇబ్బందులు పడుతున్న వారే కనిపించారు. వైద్యులు, సిబ్బంది వారి చుట్టూ చేరి... ఛాతీపై నొక్కుతూ, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆక్సిజన్ అందించేందుకు ప్రయత్నించారు. బాధితుల కుటుంబ సభ్యులు కూడా సపర్యలు చేస్తూ కనిపించారు. సోమవారం రాత్రి 7 గంటలకు ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా... నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సిలిండర్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. 7.45 గంటలకు చెన్నై నుంచి వచ్చిన ట్యాంకర్‌తో ఆస్పత్రిలోని ట్యాంకును నింపి.. సరఫరాను యథాతథ స్థితికి తీసుకొచ్చారు. కానీ... ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కలిగిన 15-30 నిమిషాల వ్యవధిలోనే దారుణం జరిగిపోయింది. తమ వారు కళ్లెదుటే ఆక్సిజన్ అందక గిలాగిలా కొట్టుకుంటూ విగత జీవులుగా మారడంతో బాధితుల బంధువుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వైద్యులను, సిబ్బందిని, ప్రభుత్వాన్ని నిందిస్తూ... వైద్య పరికరాలను ధ్వంసం చేశారు. వైద్య సిబ్బందిపై దాడికి ప్రయత్నించారు. భయాందోళనతో వైద్యులు, సిబ్బంది అక్కడి నుంచి పరుగులు తీశారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రుయాస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాలో తలెత్తిన అంతరాయం వల్ల 11మంది చనిపోయారని కలెక్టర్ హరినారాయణన్ ప్రకటించారు. ఐదు నిమిషాలు ఆక్సిజన్ సరఫరాలో తలెత్తిన అంతరాయం వల్ల కొంతమంది చనిపోయారన్నారు. చెన్నై నుంచి ఆక్సిజన్ ట్యాంకర్లు రావడంతో చాలా ప్రాణాలను రక్షించగలిగామన్నారు. పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు.

# కేంద్రంపై వైసీపీ నేతల గరం గరం



గుంటూరు, మే 11, (న్యూస్ పల్స్) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయడం లేదని.. ముఖ్యంగా ప్రత్యేక హోదా, పోలవరం అంచనాల పెంపు, దిశా చట్టం అమలు.. వంటి కీలక విషయాల్లో.. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేదని వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో మదన పడుతున్నారు. తాము చెప్పిన మాటలను కేంద్రంలోని ప్రభుత్వం అస్సలు వినిపించుకోవడం లేదని ఎంపీలు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో కేంద్రానికి ? ఏపీ ప్రభుత్వానికి మధ్య గ్యాప్ పెరుగుతోందని అనుకునేవారు ఎక్కువగా ఉన్నారు. అంటే.. కేంద్రంలోని బీజేపీతో జగన్ సర్కారుకు చెడుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో బీజేపీ సహకరించడం లేదని చెబుతూనే.. బీజేపీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం జగన్ స్నేహం చేయడం.. ఆయన చెప్పినట్టు వినడం.. ఆయన చెప్పినట్టు చేయడం వంటివి రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా మూడు విషయాల్లో జగన్ తీసుకున్న నిర్ణయాలు.. ఆయనకు.. ప్రధాని నరేంద్ర మోడీకి మధ్య సంబంధాలను స్పష్టం చేస్తున్నాయని అంటున్నారు పరిశీలకులు. వీటిలో ప్రధానంగా రాజ్యసభ టికెట్‌ను మోడీ, అమిత్ షా ఉమ్మడి మిత్రుడు.. ప్రముఖ వ్యాపార వేత్త.. ముకేష్ అంబానీ మిత్రుడైన.. నత్వానీకి కేటాయించారు.రాష్ట్రంలో అనేక మంది వైసీపీ నాయకులు రాజ్యసభ టికెట్‌ను ఆశించారు.కానీ, జగన్ మాత్రం మోడీ మిత్రుడికి కేటాయించారు. ఇక, మోడీకి మరో మిత్రుడు.. గుజరాత్ వ్యాపార దిగ్గజం.. ఆదానీకి ఏపీలోని పోర్టులను ధారాదత్తం చేయడం. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టును పూర్తిగా ఆదానీ సంస్థలు దక్కించుకున్నాయి. ఇక, మూడో విషయం.. గుజరాత్‌కే చెందిన మోడీకి ఎంతో ఇష్టమైన.. అమూల్ పాల సంస్థకు ఏపీలో స్థానం కల్పించారు. అంతేకాదు.. అమూల్ కోసం.. స్థానిక పాల డెయిరీలను కూడా తొక్కేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇక.. ఇతర బిల్లులకు సంబంధించి.. పార్లమెంటులోనూ మోడీకి జై కొడుతున్నారు. ఇలా.. మోడీతో జగన్ స్నేహం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని అంటున్నారు పరిశీలకులు. మరి ఏపీకి ఎలాంటి ప్రయోజనాలు చేయనప్పుడు.. మోడీతో జగన్ స్నేహం ఎందుకు? అనేది కీలక ప్రశ్న. వ్యక్తిగత లబ్ధి చూసుకుంటున్నారా? అనే సందేహం వస్తోందని అంటున్నారు పరిశీలకులు. ఈ విషయంపై వైసీపీ నేతలు చాలా గుంభనంగా ఉండడం గమనార్హం.

# పలాస నియోజకవర్గంలో లో కోవిడ్ మరణాల శాతాన్ని తగ్గించండి

**- అధికారులకు, వైద్యులకు మంత్రి డాక్టర్ సీదిరి విజ్ఞప్తి**

శ్రీకాకుళం అందరం కలిసి సమన్వయంగా పని చేద్దాం - కోవిడ్ నియంత్రణ చర్యలు మరింత విస్తృతపరుద్దామని మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి, డివిజనల్ పోలీస్ అధికారి, పలాస నియోజకవర్గ పరిధి పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, అన్ని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల కన్సల్టెంట్లు, మున్సిపల్ కమిసినర్ తో కలిసి కోవిడ్ నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కోవిడ్ మరణాల శాతం పెరుగుతున్న నేపథ్యంలో మరణాలు నియంత్రణకు వైద్యులు, వైద్య సిబ్బంది మరింత సమయస్ఫూర్తితో పనిచేసి ప్రాథమిక స్థాయిలోనే వైద్యసేవలు విస్తృతపరిచి మరణాల శాతాన్ని తగ్గించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేయాలని అన్నారు. కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారనైన పేషెంట్లకు ప్రాథమిక స్థాయిలోనే పూర్తి స్థాయి వైద్యాన్ని అందించి, హోమ్ ఐసోలేసన్లో ఉన్న బాధితులకు మెడిసిన్ కిట్లు అందించి, మూడు, నాలుగు రోజుల తరువాత మరల టెస్టులు జరిపించాలని ప్రతిరోజు స్థానికంగా ఉండే ఏ.యన్.యం, ఆశా వర్కర్లతో పర్యవేక్షణ చేయించి బాధితులలో మనోధైర్యం నింపాలని అన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి ఎలాంటి లక్షణాలున్నా వారందరికీ కచ్చితంగా వైద్యపరీక్షలు నిర్వహించాలని, సామాజిక దూరం, స్వీయ నియంత్రణ, కచ్చితంగా పాటించాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని ప్రజలకు తెలియజేయమని కోరారు. గ్రామాలలో పారిశుధ్యం కచ్చితంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు, 12 గంటల తరువాత వైద్యం మరియు అత్యవసర సేవల నిమిత్తం మాత్రమే బయటకు రావాలి తప్ప ఎవరూ కూడా అనవసరంగా బయట సంచరించకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ లీల, డీఎస్పీ శివరామి రెడ్డి, ఐ.యం.ఏ డాక్టర్లు మల్లేశ్వరరావు, విజయకుమార్, బీమారావు, బాలకృష్ణ, జగదీష్, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పండుగ కష్టమేనా

విజయవాడ, మే 11, (న్యూస్ పల్స్) అవును. జగన్ జాతకం ఎలాంటిది అంటే ప్రతీదీ కష్టపడే అందుకోవాలి. తీరా అందుకున్నాక దాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించాలన్నా కూడా కుదిరే పరిస్థితి లేకుండా పోతోంది. ఏపీ సీఎం కావలన్నది జగన్ కల. దాని కోసం పదేళ్ల పాటు పరితపించారు. ఏకంగా తనను తాను ఒక సమిధను చేసుకుని మరీ సమరం సాగించారు. మొత్తానికి అనుకున్న పీఠం అందుకున్నారు కానీ ఆ సంతృప్తి మాత్రం ఆయనకు లేకుండా పోతోంది. ఒక వైపు అయిదేళ్ల పాలనలో మొత్తానికి మొత్తం ఖజానాను గోకేసి టీడీపీ పెద్దలు చల్లగా జారుకున్నారు. వారు చేసిన పొరపాట్లకు వారసుడిగా జగన్ చేదు ఫలితాలను అనుభవించాల్సి వస్తోంది.గత రెండేళ్లుగా ఠంచనుగా ఒక సీజనల్ వ్యాధిలా కరోనా వచ్చిపడుతోంది. గత ఏడాది ఇదే సమయాన కరోనా రావడంతో ఏపీలో అన్ని రకాల కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఆఖరుకు జగన్ సీఎం గా ప్రమాణం చేసిన తొలి ఏడాది పండుగ కూడా జరుపుకోవడానికి లేకుండా పోయింది. 2019 మే 30న జగన్ సీఎం గా బాధ్యతలు స్వీకరించారు. 2020 మే నెలలో ఏడాది వేడుకలకు ఆస్కారమే లేకుండా కరోనా మహమ్మారి నాడు ఏపీని అతలకుతలం చేసింది. దాంతో ఆ ఊసే లేకుండా పోయింది.ఇక చూస్తే ఏపీలో కరోనా సెకండ్ వేవ్ ఈ ఏడాది కూడా దారుణంగా ఉంది. గత ఏడాదే నయం అన్నట్లుగా కూడా సెకండ్ వేవ్ జోరు ఉంది. ఈ దెబ్బతో ఎటువంటి యాక్టివిటీ అన్నదే లేకుండా పోయింది. దాంతో అద్వితీయంగా ద్వితీయ వార్షికోత్సవాన్ని చేద్దామనుకున్న వైసీపీకి కరోనా షాక్ ఇచ్చేసింది అంటున్నారు. ఈ ఏడాది ప్రత్యేకత ఏంటి అంటే లోకల్ బాడీస్ తో సహా అన్ని ఎన్నికల్లోనూ జగన్ పార్టీ వార్ వన్ సైడ్ అన్నట్లుగా విజయ విహారమే చేసింది. అయినా సరే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి కరోనా అసలు చాన్స్ ఇవ్వడంలేదు అని క్యాడర్ తో పాటు లీడర్లు కూడా తెగ బాధపడుతున్నారు.ఇక జగన్ సీఎం గా గద్దెనెక్కి రెండేళ్ళు అవుతున్న వేళ పండుగకు కూడా మమ అనిపించాల్సిందే. మరి ఈ ముచ్చట్లు అన్నీ మరో ఏడాదికి వాయిదా వేసుకోవాల్సిందే అంటున్నారు. అయితే 2022 నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో. ఆ ఏడాది రాజకీయం ఏ తీరున సాగుతుందో అన్న చర్చ కూడా వైసీపీలో ఉంది. ఆనాటికి వైసీపీ అధికారంలోకి వచ్చి మూడేళ్ళు పూర్తి అవుతాయి. అంటే మెజారిటీ పాలన ముగిసి యాంటీ ఇంకెంబెన్సీ కూడా మెల్లగా పెరిగే అవకాశాలు ఉంటాయి. దాంతో అలాంటి వేళ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నా అవి చివరికి నెగిటివిటీనే పెంచుతాయేమో అన్న చర్చ కూడా ఉంది. మొత్తానికి చూస్తూంటే జగన్ సీఎం గా ప్రమాణం చేశారు

# మంత్రి పెద్దిరెడ్డి గ్రాఫ్...

తిరుపతి, మే 11, (న్యూస్ పల్స్) మంత్రి అని తీరిగ్గా తిని కూర్చుంటే.. ఏం లాభం అనుకున్నారో.. ఏమో.. 67 ఏళ్ల వయసులోనూ ఆయన దూకుడుగా రాజకీయాలు చేస్తున్నారు. యువ మంత్రులకు, నేతలకు ఏమాత్రం తీసిపోని విధంగా రాజకీయాల్లో తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. మరీ ముఖ్యంగా సీఎం జగన్ పెడుతున్న లక్ష్యాలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ.. తన పేరును మరింత ఇనుమడింపజేసుకుంటున్నారు. ఇప్పుడు పార్టీలో ఆయన నెంబర్ 2 ? 4 అన్న మాట సర్వత్రా వినిపిస్తుండగా.. కొన్ని జిల్లాల్లో మాత్రం నెంబర్-1 అనే మాట వినిపిస్తోంది. ఆయనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం నుంచి వరుస విజయాలు దక్కించుకు న్నారు.వైసీపీ సర్కారు ఏర్పడిన తర్వాత.. పంచాయతీరాజ్.. గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి ఇలాంటి శాఖల్లో పెద్దగా పని ఉండదు. ఉన్నా.. పెద్దగా పేరు ఎక్కడా వినిపించదు. కానీ, పెద్దిరెడ్డి తనదైన స్టైల్‌లో దూసుకుపోయారు. ఒకవైపు తన శాఖల పనులు చూసుకుంటూనే .. ప్రత్యర్థి పార్టీలకు కౌంటర్లు ఇస్తూ.. మీడియలో నిలిచారు. ఈ క్రమంలో వచ్చిన పంచాయతీ ఎన్నికల్లో జగన్ 90శాతం సాధించి తీరాలన్న లక్ష్యాన్ని భుజాన వేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ.. జగన్ లక్ష్యాన్ని సాధించారు. అదే సమయంలో తన సొంత నియోజకవర్గం, జిల్లా చిత్తూరు, పుంగనూరుల్లో.. కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హవాను కొనసాగిస్తున్నారు.టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం.. కుప్పంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు ఎన్నికల్లో విజయం సాధిస్తూనే.. మరోవైపు కుప్పంలోనూ రాజకీయాలు చక్కబెడుతున్నారు. ఇక, ఇటీవల జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలోనూ వైసీపీ విజయానికి కంకణం కట్టుకోవడమే కాకుండా జగన్ పెట్టిన మెజారిటీ సాదించేందుకు ఆయన కృషి చేశారు. ఇవన్నీ కూడా ఆయనకు జగన్ దగ్గర మంచి మార్కులు పడేలా చేశాయి. ఇక, ఇప్పుడు తాజగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన కృషి.. ఢిల్లీకి పాకింది.కేంద్ర ప్రభుత్వం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా.. ప్రకటించే ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డుల్లో.. ఏకంగా.. ఏపీకి 17 జాతీయ అవార్డులు లభించాయి. ఇది అంత చిన్న విషయం.. పక్కన పెట్టేయాల్సిన విషయం ఎంతమాత్రం కాదు? పొరుగున ఉన్న తెలంగాణకు నగర పాలకాల్లో కేవలం 12 అవార్డులు వస్తే..ఏపీకి ఏకంగా 17 అవార్డులు వరించాయి. ఇదంతా కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషేనని.. మంత్రి వర్గం తీర్మానం చేయడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం జగన్‌కు జరిగిన వర్చువల్ సమావేశంలో ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్.. పెద్దిరెడ్డిని అభినందించారు. ఈ పరిణామంతో.. పెద్దిరెడ్డి గ్రాఫ్ జగన్ దగ్గర మరింత పెరిగిందని అంటున్నారు వైసీపీ సీనియర్లు.

# అండర్ గ్రౌండ్ లోకి నేతలు

కాకినాడ, మే 11, (న్యూస్ పల్స్) కరోనా సెకండ్ వేవ్ లో తెలుగుదేశం పార్టీ లోని తూర్పుగోదావరి జిల్లా నేతలంతా అండర్ గ్రౌండ్ లోకి వెళ్లిపోయారు. చంద్రబాబు పార్టీ పరంగా ఇచ్చే పిలుపులకు ఇంటి నుంచి ఉద్యమాలు చేస్తూ మిగతా సమయంలో సైలెంట్ అయిపోతున్నారు. అదే కరోనా తొలి వేవ్ లో మాత్రం పార్టీ ఇచ్చే పిలుపులకు సంబంధం లేకుండా ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ ఎదో ఒక నిరసన కార్యక్రమాలను, సేవా కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో పసుపు దళాలు నిర్వహించేవి.కానీ పంచాయితీ మునిసిపల్ ఎన్నికల ఫలితాల తరువాత టిడిపి శ్రేణులకు ఉన్న ఓపిక కాస్తా పోయి నీరసం వచ్చేసింది. దాంతో క్యాడర్ పటిష్టంగా ఉండే తూర్పు లో ఆ పార్టీ గళం వినిపించడమే గగనం అయిపొయింది. ఎవరికి వారు ఇంటికే పరిమితమయ్యారు. తమ వ్యాపారాలను చూసుకునే వారు కొందరైతే, ఇప్పుడే రెస్ట్ సమయమని మరికొందరు కుటుంబసభ్యులతో గడుపుతున్నారు.తూర్పు గోదావరి జిల్లాల్లో టిడిపి కి గ ట్టి నేతలే ఉన్నారు. యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ వంటి పే ామాహేమిలుతప్ప జోరు పెంచడం లేదు. వీరిలో కాస్త మెరుగ్గా ఉన్నది పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాత్రం అటు ప్రసార మాధ్యమాల్లోను ఇటు సోషల్ మీడియా లో పోస్ట్ లతో హల్చల్ చేస్తున్నారు తప్పితే మిగిలిన వారంతా గో కరోనా గో అంటూ ఇంట్లో నినాదాలు చేస్తున్నారు. తూగో లో ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు ఎవరంటే కూడా చాలామంది దిక్కులు చూసే పరిస్థితి కొనసాగుతుంది. ఇలాంటి దుస్థితి గతంలో ఎప్పుడు లేదని కూడా తమ్ముళ్ళు వాపోతున్నారు. మరి అధినేత తూర్పు గోదావరి తమ్ముళ్లలో జోష్ పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపడతారో చూడాలి.

# కరోనా సమయంలో రాజకీయాలా

విజయవాడ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎపీలో కరోనాతో ప్రజలు అల్లాడుతున్నారు. వెల్లంపల్లి మంత్రిగా ఉండి కరోనా సమయంలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గు చేటని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ విమర్శించారు. మిమ్మలను ఓట్లేసి గెలిపించింది... ఇంట్లో కూర్చోవడానికేనా మంత్రిగారూ. పశ్చిమ నియోజకవర్గంలో కోవిడ్ సెంటర్లను ఎందుకు ఏర్పాటు చేయలేదో మంత్రి వెల్లంపల్లి సమాధానం చెప్పాలి. అసలు కరోనా టెస్ట్ లు, రిపోర్టులు ఎప్పుడు వస్తాయో కూడా కనీసం సమాచారం చెప్పలేకపోతున్నారు. జిల్లా మంత్రిగా విజయవాడలో ఒక్క సమీక్ష అయినా చేశారా. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఏర్పాట్లను కూడా పరిశీలించలేకపోయారా. వైసీపీ గొప్పగా చెప్పుకునే వార్డు వాలంటీర్లు వ్యవస్థ ఏం చేస్తుంది. రెండేళ్లుగా కనీసం పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ది పనులు కూడా చేపట్టలేదని అన్నారు. ఎంతసేపూ ఆలయాలను అడ్డం పెట్టుకుని దోపిడీ చేయడం. స్థలాలను కబ్జా చేయడం పైనే వెల్లంపల్లి దృష్టి అంతా. మొదటి కరోనా వేవ్ లో కూరగాయల పంపిణీ పేరుతో దోపిడీ చేశారు. రెండో వేవ్ లో అర్చక పోస్టుల భర్తీతో లక్షల వసూళ్లు చేస్తున్నారు. కరోనా ... అందరినీ కష్ట పెడుతుంటే .. వెల్లంపల్లికి మాత్రం కాసులు కురిపిస్తుందని ఆరోపించారు.పెన్షన్లు, రేషన్ ఇచ్చినప్పుడు పొటోలు దిగే కార్పోరేటర్లంతా ఇప్పుడు ఎక్కడ. కరోనాతో బాధ పడుతున్న వారికి కనీసం సాయం అందించారా. విశాల ప్రాంగణం ఉన్న కెబీయన్ కళాశాలలో వ్యాక్సిన్ కేంద్రం పెడతారా.. బెడ్ లు ఏర్పాటు చేయరా . శాశ్వత వ్యాక్సిన్ కేంద్రం ఏర్పాటుకు నా కార్యాలయం ఇస్తా.. తీసుకోండి. అవసరమైతే.. ఇందుకు సొంత ఖర్చులు భరించేందుకు సిద్ధంగా ఉన్నాను. పది ఎకరాల భూమి ఉన్న కేబీయన్ కాలేజీ ప్రాంగణంలో పడకలు ఏర్పాటు చేయండి. వ్యాక్సిన్, ఇంజక్షన్, బెడ్లు కొరతతో ప్రజలు పరుగులు పెడుతున్నా... పట్టించుకోరా. స్మశానాలలో అంత్యక్రియలకు కూడా టోకెన్ తీసుకోవాల్సిన దుస్థితి. ప్రజలు కోరుకున్నది ఇటువంటి పాలన కాదు జగన్ రెడ్డి గారూ.. ఓట్లు వేసిన ప్రజలకు.. ఇదేనా మీరు అందించే పాలన అని మండిపడ్డారు.

# చిన్న ఊళ్లు... కరోనాకు దూరం

గుంటూరు, మే 11, (న్యూస్ పల్స్) ప్రపంచమంతా కరోనా మహమ్మారితో అల్లాడుతుంటే.. గుంటూరు జిల్లా వినుకొండకు ఆనుకుని ఉన్న చిన్న పల్లెటూరు మాత్రం నిశ్చింతగా ఉంటోంది. ఆ గ్రామంలో ఇప్పటివరకు ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం. కరోనా రహిత గ్రామంగా ప్రశాంతమైన వాతావరణంలో గ్రామస్తులు జీవనం సాగిస్తున్నారు.గ్రామస్తులు, యువత, అధికారులు కలిసికట్టుగా కట్టడి చర్యలు చేపట్టడమే దీనికి కారణం. వినుకొండకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉప్పరపాలెంలో 4 వేల జనాభా ఉన్నారు. సర్పంచ్ గోపు కృష్ణ ఆధ్వర్యంలో యువత కమిటీలుగా ఏర్పడి ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ బయటి నుంచి వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఎవరికి వారు స్వచ్ఛందంగా కరోనా కట్టడికి సహకరిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీనిపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పరపాలెం గ్రామంలో ఎక్కువగా వలస కూలీలు ఉన్నారు. ఆ గ్రామం వినుకొండ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గ్రామంలో కరోనాపై అవగాహన సదస్సులతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. ఇకపై కూడా ఎలాంటి కేసులు రాకుండా ఉండేందుకు కృషి చేస్తున్నామంటున్నారు గ్రామస్థులు

# పనస... విరగ కాసింది

శ్రీకాకుళం, మే 11, (న్యూస్ పల్స్) ఉద్దానం పంటను ఉత్తరాది వాళ్లూ మెచ్చారు. ఇక్కడి పనసకు కాయలను ఆ రాష్ట్రాల వారు లొట్టలేసుకుని తింటున్నారు. దీంతో ఇక్కడి పనస డిమాండ్ పెరుగుతోంది. రుచి పరంగా అద్భుతంగా ఉండడంతో పాటు రంజాన్ సీజన్ కావడంతో ఉత్తరప్రదేశ్, బిహార్, తదితర రాష్ట్రాలు ఉద్దానం ప్రాంతం నుంచి పనస కాయలు, పండ్లను దిగమతి చేసుకుంటున్నాయి.మరోవైపు కాశీబుగ్గ కేంద్రంగా బరంపురం, గుజరాత్, కోల్‌కతా, కటక్ తదితర ప్రాంతాలకు కూడా పనస ఎగుమతి అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ, పూండి, హరిపురం, కవిటి, ఇచ్ఛాపురం, మందస, కంచిలి, సోంపేట కేంద్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు పనస ఎగుమతులు ఊపందుకున్నాయి. గడచిన రెండు నెలల్లో రోజుకు సగటున 44 టన్నుల చొప్పున ఇప్పటివరకు 2,640 టన్నుల పనస కాయలు ఎగుమతి అయ్యాయి.మార్చి నెలాఖరు నుంచి మే వరకు పనస ఎగుమతులు కొనసాగుతాయి. తిత్లీ తుపానుకు దెబ్బతిన్న పనస చెట్లన్నీ ఈ ఏడాది జీవం పోసుకుని విరగకాస్తున్నాయి. ఉద్దాన ప్రాంతంలోని ఏడు మండలాల్లో పనస అంతర పంటగా సాగవుతోంది. ఇబ్బడిముబ్బడిగా దిగుబడులు రావడంతో ప్రస్తుతం కేజీ పనస కాయ కేవలం రూ.13 చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర గతంలో కేజీ రూ.20 వరకు ఉండేది. ఉద్యాన శాఖాధికారులు పనస, మునగ తదితర పంటలకూ ప్రభుత్వ పరంగా ధరలు నిర్ణయిస్తే మేలు జరుగుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.పనస ముక్కల బిర్యానీ, పనస పొట్టు కూర, పనస పండు హల్వా, పనస పొట్టు పకోడి, పనస గింజల కూర, పనస ముక్కల గూనచారు, పనస చిల్లీ, పనస కాయ కుర్మా, పనసకాయ ఇడ్లీ, పొంగనాలు, పనస నిల్వ పచ్చడి, పనస బూరెలు.శ్రీకాకుళం జిల్లాలోని మన్యంలోనూ పనస పండుతున్నప్పటికీ ఉద్దాన ప్రాంతమే దీనికి చిరునామాగా మారింది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలతో పాటు టెక్కలి నందిగాం మండలంలోనూ పనస పంట ఉంది. 8 మండలాల్లో ఈ ఏడాది విరగ కాసింది. ఎకరాకి రెండు నుంచి ఐదు చెట్లు ఉన్న రైతులు కలుపుకుని కేవలం ఉద్దానంలో వెయ్యి హెక్టార్లలో, జిల్లా వ్యాప్తంగా 25వేల హెక్టార్లలో మిశ్రమ పంటగా పండిస్తున్నారు. పండిన పంటలో 80 శాతం పంట కేజీ, కేజీన్నర కాయ పెరిగేంత వరకు మాత్రమే ఉంచి మార్కెట్ చేస్తారు. 20 శాతం కాయలు, వెనుక పండిన కాయలు పనస పండ్లుగా రెండో రకం మార్కెటింగ్ చేస్తారు.

# నెహ్రూ నగర్ గ్రామ ప్రజలు భయపడొద్దు

## ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు నెహ్రూ నగర్ గ్రామ ప్రజలు భయపడాల్సిన అవసరం ఏమీ లేదని ధైర్యంతో మాస్కు ధరించి సామూహిక దూరం పాటించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం నాడు పగిడ్యాల మండలం కోవిడ్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమీక్ష సమావేశమును నెహ్రూ నగర్ గ్రామ సచివాలయ కార్యాలయము-ఎ లో నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేఆర్థర్ మాట్లాడు కరొనా మహమ్మారి వివిధ రూపాలలో విజృంభిస్తుందని అందువలన ప్రజలు మంచి పౌష్టికాహారం తీసుకుని. డాక్టర్ల సలహా మేరకు శాంటేజర్స్. మాస్కులు ధరించి. ప్రతి రోజు స్నానం చేస్తూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నొప్పి.జలుబు. జ్వరం. వచ్చిన వెంటనే డాక్టర్ తో కలిసి వైద్యం చేయించుకోవాలని. నిర్లక్ష్యం చేసినట్లయితే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమని నెహ్రు నగర్ గ్రామ ప్రజలకు ఎలాంటి చిన్న సమస్య వచ్చినా అధికారులు గాని. నాకు కానీ తెలిపినట్లు అయితే తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు గ్రామీణ సి ఐ ప్రసాద్ , పగిడ్యాల మండల అభివృద్ధి అధికారి గౌరీ దేవి , డిప్యూటీ తహసీల్దార్ జోగన్న , ఈవో ఆర్ డి ఫక్రుద్దీన్. పగిడ్యాల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. బలరాం నాయక్. మరియు డా.మోహన్ , నెహ్రూ నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, మరియు ముచ్చుమర్రి ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# రుయా ఆసుపత్రిని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు

తిరుపతి తిరుపతి రుయా ఆసుపత్రిని మంగళవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి ఎం.పి. గురుమూర్తి, తిరుపతి కార్పోరేషన్ మేయర్ శిరీషాలు సందర్శించారు.ఆసుపత్రిలోని సంఘటన జరిగిన కోవిడ్ వార్డును, ఆక్సిజన్ ప్లాంట్ ను పరిశీలించారు.వైద్య బృందాలతోను,రుయా అధికారులతో చర్చించారు. చెన్నై నుంచి రావాల్సిన ఆక్సిజన్ ఆలస్యం కావడంతో ఈ దుర్ఘటన తలెత్తిందని,కరోనా భాదితులు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని,అయితే ఇలాంటి ఘటనలు రాజకీయ లబ్ధికోసం కాకుండా సమిష్టి కృషితో కరోనాపై తరిమికొట్టాలని కోరారు.మరోవైపు రుయా ఆసుపత్రి వద్ద బీజేపీ నేతలు నిరసనకు దిగారు.బీజేపీ నేత భానుప్రకాష్ ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు.దీంతో పోలీసులు బీజేపీ నేతను అదుపులోకి తీసుకున్నారు.ఆసుపత్రిలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని,తక్షణమే అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

## ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం విజయనగరం జిల్లా పార్వతీపురం లో. కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులలో ఏటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నరు. ఈ క్రమంలో పార్వతీపురం ప్రాంతీయ కోవిడ్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు కల్పన, కరోనా బాధితులకు అందిస్తున్న రోజువారీ ఆరోగ్య పరిస్థితులు పర్యవేక్షణ తదితర అంశాలపై మంగళవారం పార్వతీపురం శాసన సభ్యులు అలజంగి జోగారావు ఏరియా ఆస్పత్రిలో ఆసుపత్రి వైద్యులు, ఐటీడీఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్ కూర్మనాథ్, డిప్యూటీ డిఎం ఢ హెచ్ఓ డాక్టర్ రవికుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశం లో శాసన సభ్యులు మాట్లాడుతూ ఆసుపత్రికి ఇంకా అవసరం అయిన మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగినది అని అందులో భాగంగా 40 ఆక్సిజన్ బెడ్డులను 60 వరకు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, అవసరం అయిన మానవ వనరులు సమకూర్చడం, కరోనా రోగుల వైద్య సమాచారం ఎప్పటికప్పుడు బాధితుల కుటుంబాలకు చెరవేయటం, అత్యవసరం అయిన ఆక్సిజన్ నిల్వలు 2కేఎల్ సమకూర్చడం, ఆసుపత్రి పారిశుధ్యం 24 గంటలూ నడిచేలా చూడటం, బాధితులకు త్రాగటానికి వేడి నీరు సమకూర్చడం, కరోనా రోగులకు అవసరం అయిన వారికి ఇంజెక్షన్లు చేయటం వంటి తదితర సేవలను అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది అని శాసన సభ్యులు పేర్కొన్నారు.. ఈ సమావేశంలో ఐటీడీఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్ కూర్మనాథ్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, ఆసుపత్రి వైద్య అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మనం చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో మూడవసారి ఆక్సిజన్ వితరణ

విశాఖపట్నం కరోనా సోకిన వారికి తెలుసు.. ఎంత కష్టమో... ఎంత ఇబ్బందో.. దేవుని దయో... డాక్టర్ల శ్రమో... సంపాదించుకున్న డబ్బు బలమో... చేసిన మంచో... శరీరానికి అందించిన ఇమ్యూనిటీ నో... చాలా మందిని సురక్షితంగా ఇంటికి చేర్చింది..కన్న తల్లితో, తండ్రితో... భాగస్వామి.. భార్యతో లేక కన్న బిడ్డలతో.. బంధువులతో, స్నేహితులతో ఆనందంగా ఉంచింది... కానీ ఎన్నో హాస్పటల్లో కరోనా సోకి మనలాగే ఆనందంగా సంతోషంగా ఉండాల్సిన వారు ప్రాణం కోసం కొట్టుమిట్టాడుతున్నారు.వైద్య చికిత్స చేయించుకుంటున్నారు ... ఇలాంటి వారికి కరోనా నుంచి కోలుకొన్న వారు మాత్రమే అందించగల ప్లాస్మాను భాధితులకు అందించటానికి మనం చారిటబుల్ ట్రస్ట్ ప్రయత్నం చేస్తుంది . అయితే ప్లాస్మా అనేది అంగట్లో దొరికే సరుకు కాదు... కొనుక్కోడానికి... కోవిడ్ బారినపడి కోలుకున్న వారు మాత్రమే ఇవ్వగలిగే ఆయుష్షు ప్లాస్మా... అలాంటి ప్లాస్మాను ప్రతీ ఒక్కరూ దానం చేయడానికి ముందుకు రావాలని హాస్పిటల్ బయట ఉన్న వారు ప్లాస్మా కోసం ఎన్ని కాళ్ళు మొక్కుతున్నరో...వారి కష్టమును మన కష్టముగా భావించి ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపాలని మనం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కరోనా నుండి కోలుకున్నవారిని కోరుతున్నారు. అందుకుగాను ప్లాస్మా దానం చేయదలచిన వారు దానరి శివ గుప్తా ని (8328098871ఢ9247300789) సంప్రదించవలసిందిగా మనం చారిటబుల్ ట్రస్ట్ కోరుకుంటున్నది. అలాగే ప్లాస్మా తో పాటు నేడు కరోనా భాదితులు ఎదురుకుంటున్న మరొక ముఖ్య సమస్య ప్రాణవాయువు కొరత. ఈ నేపథ్యంలోనే యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి లో ఆక్సిజన్ అందుబాటులో ఉంచాలి అన్న ఉద్దేశ్యం తో ఇంతకుముందు రెండుసార్లు ప్రాణవాయువును నింపి ఇచ్చిన ఆక్సిజన్ సిలిండర్లు అయిపోగానే మళ్లీ వాటిని మనం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత కుంద్రపు అప్పారావు గారి ఆర్థిక సహాయంతో ఫుల్ ఫిల్ చేసి గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బందికి మంగళవారం మనం సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా మనం చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరి పందూరి సురేష్ మాట్లాడుతూ ఇప్పుడున్న కరోనా సెకండ్ వేవ్ చాలా ప్రమాదకరంగా ఉందని చాలామంది ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు అని.. దీనిని నివారించడానికి ప్రతి ఒక్కరూ భాద్యత గా మెలుగుతూ.. మాస్కులు ధరించి..అవసరం అయితేనే బయటకు రావాలని...అలా వచ్చినా సరే భౌతిక దూరం పాటిస్తూ, చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. అలాగే ఈ కష్టకాలంలో ప్రాణవాయువుని అందిస్తున్నందులకు కుంద్రపు అప్పారావు గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుంద్రపు అప్పారావు,గారా సత్తిబాబు,తంగేటి ప్రకాష్,కర్రి వీరు నాయుడు ( మాస్టర్), మళ్ళ తులసి (ఆడిటర్), కరెడ్ల సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అదీప్ నియోజకవర్గ ప్రజలను ఆదుకోవాలి

## బండారు అప్పలనాయుడు

విశాఖపట్నం పెందుర్తి శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ పెందుర్తి లోని కోవిడ్ -19 సెంటర్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం మంచి పరిణామం కాకపోతే అనుభవం కలిగిన డాక్టర్లు అన్ని సౌకర్యాలు ఉన్న 30 పడకల ఆసుపత్రిలో కాకుండా ఏదో స్కూల్లో, ఏఎన్ఎం, ఆశా వర్కర్ల పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తాను అనడం కొంచెం అభ్యంతరకరంగా ఉందని, ఎమ్మెల్యే అదీప్ రాజు పెందుర్తి నియోజకవర్గ ప్రజలను ఆదుకోవాలని టీడీపీ నాయకులు బండారు అప్పలనాయుడు అంటున్నారు. దూరదృష్టితో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి వైద్యపరంగా అన్ని మండలాలను అభివృద్ధి చేయడం జరిగిందని, దేవాడ లోని ఆసుపత్రి మొదలు పెందుర్తిలో 30 పడకల ఆసుపత్రి వరకూ అన్ని సౌకర్యాలు ప్రజలకు కల్పించారని అన్నారు. కనుక వాటిని ప్రజలకు మరింత అందుబాటులో ఉండే విధంగా ప్రయత్నించాల్సినీదిగా శాసనసభ్యుని కోరారు. కావున అదీప్ ఆయన సొంత పేరు కోసమే ప్రభుత్వ సంస్థలు పక్కన పెడుతున్నారని, తెలుగుదేశం ప్రభుత్వంలో బండారు సత్యనారాయణ మూర్తి మంజూరు చేయించిన అంబులెన్స్ నిరుపయోగంగా ఉండడం దానికి ఉదాహరణ, వాటిని ఉపయోగించకుండా సొంత నిధులతో ఏదో చేస్తానని ప్రతిసారి గొప్పలు చెప్పడం మంచిది కాదు గతంలో అదీప్ రాజ్ ఇచ్చిన సబ్బవరం అంబులెన్స్ ఈరోజుకి అడ్రస్ లేదు, 11 ఆగస్టు 2020 తారీఖున ఆయన ప్రకటించిన మూడు అంబులెన్సులు అడ్రస్ లేవు, నిన్న తాజాగా రెండు అంబులెన్స్ అని ప్రకటించడం జరిగిందని మరి ఇవి ఎప్పటికి వస్తాయో అదీప్ రాజ్ వారికే తెలియాలి, పెందుర్తి నియోజకవర్గం మొత్తానికి శాసనసభ్యులు అన్న విషయం మర్చిపోయి కేవలం రాంపురంలోని ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక వ్యాక్సినేషన్ పెట్టుకోవడం ఎంత వరకు సమంజసం..? రాంపురం గ్రామంలాగే అన్ని గ్రామాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమం పెట్టండి, అప్పుడు ప్రజలకు ఆసుపత్రుల బయట గంటలకొద్దీ క్యూ కట్టే బాధ తప్పుతుంది! కనుక వీటి మీద దృష్టిపెట్టి, పెద్ద మనసుతో ప్రజల కష్టాలు తీరుస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

# భారీగా మార్కెట్ కు ఉల్లి



హైదరాబాద్, మే 11, (న్యూస్ పల్స్) రబీ సీజన్‌లో వేసిన ఉల్లి ఇప్పుడిప్పుడే పంట పొలాల నుంచి భారీగా మార్కెట్‌కు వస్తోంది. అయినప్పటికీ దాని ధర ప్రస్తుతం రిటైల్ రంగంలో కిలోకు 25 రూపాయల వద్ద నడుస్తోంది. అతిపెద్ద ఉల్లి ఉత్పత్తి రాష్ట్రమైన మహారాష్ట్రలో టోకు ధర ప్రస్తుతం క్వింటాల్ 1100 నుండి 1500 రూపాయల వరకు నడుస్తోంది. గత సంవత్సరం ఈ సమయంలో సగటు ధర క్వింటాల్ 400 నుండి 600 రూపాయలు మాత్రమే ఉంది. దీనికి ప్రధాన కారణం ఉత్పత్తి లేకపోవడం. అయినప్పటికీ ఇంత టోకు ధర వద్ద కూడా రైతులకు ప్రత్యేక ప్రయోజనం లభించడం లేదు. ఎందుకంటే ఖర్చు కిలోకు సుమారు 16 రూపాయలు వస్తోంది.మహారాష్ట్ర ఉల్లిపాయ సాగుదారుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భారత్ దిఘోలే మాట్లాడుతూ ఈ సంవత్సరం నకిలీ విత్తనాలు, ఆలస్యంగా విత్తడంతోపాటు వర్షం, వడగళ్ళు కారణంగా ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. అందుకే ధర పెరుగుతోంది. ప్రతి సంవత్సరం ఎకరానికి సగటున 16 టన్నుల దిగుబడి లభించేంది. అయితే ఈసారి సగటున 10 నుండి 13 టన్నులు మాత్రమే లభించింది. దీంతో కిలోకు సగటున 11 నుండి 15 రూపాయల ఖర్చు రైతు మీద పడింది. పంట తక్కువగా ఉంటే ధరల పెరుగుదల ఖచ్చితంగా ఉంటుంది.ఉల్లి ఉత్పత్తి చేయడానికి కిలోకు రూ .9.34 ఖర్చవుతుందని నేషనల్ హార్టికల్చర్ బోర్డు 2017 లో చెప్పింది. ఇది నాలుగేళ్లలో 15 నుంచి 16 రూపాయలకు పెరిగింది. రైతులు ఇంకా నష్టపోతున్నారు. వారు కష్టపడి సంపాదించిన డబ్బు లేదా భూమి కౌలు కూడా లభించడం లేదని వాపోతున్నారు. మహారాష్ట్రలోని నాసిక్, అహ్మద్ నగర్, పూణే, ధూలేతోపాటు సోలాపూర్ జిల్లాల్లో ఉల్లి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఈ అన్ని ప్రదేశాలలో ఈ ఏడాది ఉత్పాదకత చాలా తగ్గింది.రైతులందరికీ ఇంట్లో ఉల్లిపాయలు ఉంచడానికి తగినంత స్థలం ఉండదు. దీనికి తోడు వారిపై చాలా ఆర్థిక ఒత్తిడి ఉంటుంది. పంట బయటకు వచ్చిన వెంటనే వాటిని మార్కెట్‌కు (మండి) తీసుకువెళతారు. ఒక గ్రామంలో 100 మంది రైతులు ఉంటే కేవలం 10 మందికి నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. స్టోర్ నిర్మించడానికి ప్రభుత్వం చాలా తక్కువ ఆర్థిక సహాయం అందిస్తుంది. 25 టన్నుల నిల్వకు 4 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం గరిష్టంగా 87,500 రూపాయలు మాత్రమే ఇస్తుంది. 2000 మంది రైతులు తహసీల్‌లోని దుకాణం కోసం దరఖాస్తు చేస్తే.. అప్పుడు లాటరీలో 100 మంది రైతులను ఎంపిక చేస్తారు. అందువల్ల పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్మవలసిన పరిస్థితి ఉంటుందని ఉల్లి రైతు అంటున్నారు.భారతదేశంలో ఉల్లి ఉత్పత్తి మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, యూపీ, బీహార్, గుజరాత్, కర్ణాటకతోపాటు రాజస్థాన్‌లలో ఉల్లి పంట అధికంగా పండుతుంది. దేశంలో వార్షిక ఉల్లి ఉత్పత్తి సగటున 2.25 నుండి 25 మిలియన్ మెట్రిక్ టన్నుల మధ్య ఉంటుంది.ప్రతి సంవత్సరం కనీసం 15 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలు అమ్ముతారు. ? నిల్వ చేసేటప్పుడు సుమారు 10 నుండి 20 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిపాయ చెడిపోతుంది.? సరిగ్గా 35 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిపాయ ఎగుమతి అవుతుంది.-20-21-21లో దీని ఉత్పత్తి 26.09 మిలియన్ టన్నులు ఉంటుందని అంచనా.-ఈ సంవత్సరం, 2020-21లో, ఇది 15,95,000 హెక్టార్లలో సాగు చేయబడింది

# కర్ఫ్యూను పరిశీలించిన కలెక్టర్

నెల్లూరు నెల్లూరు జిల్లా విఆర్సీ సెంటర్ లో కర్ఫ్యూ ను జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్ పరిశీలించారు. వాహనదారులతో మాట్లాడిన ఐడీకార్డులను పరిశీలించిన ఎస్పీ.. అనవసరంగా బయటికి రావొద్దంటూ సూచించారు.ఆక్సిజన్ యూనిట్ల ఏర్పాటకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ చక్రధర్ తెలిపారు. 24 గంటల్లోపే కోవిడ్ ఫలితాలు వచ్చేలా చూస్తున్నామని, కోవిడ్ లక్షణాలు కనిపించిన నాలుగు రోజుల్లోనే ట్రీట్ మెంట్ ప్రారంభించకపోతే ప్రాణాపాయ పరిస్థితి వస్తుందని తెలిపారు.షార్, జన్ కో, సెంబ్ కార్పు వంటి సంస్థల సహకారంతో కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేశామని పరిస్థితి విషమించిన తర్వాత హాస్పటల్ కు వస్తున్నారని,దాని వల్ల మరణాల సంఖ్య పెరుగుతోందని చెప్పారు.

# ఇళ్లకు తరలిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

కడపకడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు వర్సిటీ అధికారులు ఇళ్లకు పంపిం చారు. కరోనా మహమ్మారి రోజురోజుకు పెరిగిపోతుండం, చదువుతున్న విద్యార్థులంతా ఏడాది కిందట 10వ తరగతి పూర్తయిన వారు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 6000 మంది విద్యార్థులు సాంకేతిక విద్యనభ్యసిస్తున్నారు.ప్రస్తుతం ట్రిపుల్ఐటీలో చదువుతున్న 2000 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మిగిలిన 4000 మంది విద్యార్థులు ఆన్లైన్ ద్వారా పాఠాలు తెలుసు కుంటున్నారు.అయితే చదివే విద్యా ర్థులకు 80 శాతం పాఠ్యాంశాలు పూర్తి కావడంతో వారిని ఇళ్లకు పంపించారు.

# ఖైదీలకు తాత్కాలిక బెయిల్

కడప కరోనా మహమ్మారి సునామీలా విరు చుకుపడుతున్న వెళ్ల జైళ్లలో ఖైదీల పరిస్థితిపై సుప్రీంకోర్టు స్పందించి కీలకమైన ఆదేశాలిచ్చింది. అర్హులైన వారినందరినీ విడుదల చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మహమ్మారి ఉధృతమవుతున్న ప్రస్తుత సమయంలో అరెస్టును తగ్గించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. దింతో కడప జిల్లా జైల్ లో ఖైదీలను బెయిల్ పై విడుదల చేయనున్నారు. 2020లో తాత్కాలిక బెయిల్ పై విడుదలైన వారినందరినీ ఇప్పుడు కూడా విడుదల చేయాలని సూచించింది. గత ఏడాది కరోనా సమయంలో విడుదల చేసిన ఖైదీల్లో దాదాపు 90 శాతం మంది మళ్ళీ జైళ్ళకు వచ్చిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. జైళ్లలో ఉన్న ఖైదీలు, పోలీసుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో జైల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# క్వారీ బాధితులకు పరిహారం

కడప కడప జిల్లా మామిళ్లపల్లె క్వారీ పేలుడు భాదితులకు ఆర్థిక సాయం అందింది.మృతుల కుటుంబాలకు 10 లక్షలు, గాయపడిన వారికి 5 లక్షలు చొప్పున తక్షణ సహాయం అందిం చింది.ఈ సాయాన్ని వైసీపీ నేత సాంబశివా రెడ్డి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించారు.

# కరోనా రోగులకు పరామర్శించిన విప్ శ్రీకాంత్

కడప ఆంధ్రప్రదేశ్ లో పాజిటివ్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. తాజాగా రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే వైరస్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిప దికన చర్యలు తీసుకుంటోంది. వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసి.. కోవిడ్ ఆస్పత్రుల సంఖ్యను పెంచింది. మరోవైపు కోవిడ్ కేర్ కేంద్రంలో ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తోంది. కడప జిల్లా గండికోట లో బాధితులను ప్రభుత్వ విప్ శ్రీకాంత్ పరామర్శించారు.

# ఆక్సిజన్ సరఫరా పై స్పష్టత ఇవ్వాలి

నెల్లూరు కరోనా సెకండ్ వేవ్ తో రాష్ట్ర వ్యాప్తం గా వ్యాపించిన నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో కరోనా బాధితులకు వినియో గిస్తున్న ఆక్సిజన్ పై స్పష్టత ఇవ్వాలని నెల్లూరు బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఎంత మంది చనిపోతున్నారు, ఎంత మందికి ఆక్సిజన్ ఉపయోగిస్తున్నారు, ఎన్ని హాస్పిటల్లో బెడ్స్ అందుబాటులో ఉన్నాయో వాస్తవాలు బయట పెట్టాలని,బెడ్ లు లేక ఆక్సిజన్ సిలిండర్లు అందక ఎంతోమంది ఇబ్బందిపడుతు ప్రాణాలు అరచేతిలో పెటుకోని అల్లడిపోతున్నారని ప్రైవేటు ఆస్పత్రులో ఆక్సిజన్ ఇవ్వట్లేదనే సమాధానం చెబుతూ రోగులను తిప్పిపంపుతున్నారని ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని బెడ్లు ఖాళీగా ఉన్నాయి తెలియజేయాలని కోరారు.జిల్లాలో అనేక కార్పొరేట్ హాస్పిటల్లో లక్షలు,లక్షలు ప్రజల నుంచి వసూలు చేస్తున్నరు,రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకపోతే ఈరోజు ఈ పరిస్థితుల్లో మీరు ఉంటారా,రాష్ట్రానికి 50% వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందని ఆరోగ్య శాఖ మంత్రి ఎక్కడున్నాడో తెలియదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క రోజు కూడా బయటకు వచ్చిన పరిస్థితి లేదని కేంద్ర ప్రభుత్వం మీద నెపం వేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు ఇప్పటికైనా సమీక్ష నిర్వహించాలి డిమాండ్ చేశారు.

# కలపాడు గ్రామంలో కరోనా నియంత్రణ చర్యలు

నెల్లూరు వెంకటగిరి మండల పరిధిలోని కలపాడు గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ ఎన్ చెంచు ప్రసాద్ కరోనా నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటికి కనిపించని కరోనావైరస్ రోజు రోజుకి విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో పంచాయతీ ప్రజల సంక్షేమం కోసం, ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలో మురికివాడలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి చెత్తాచెదారం తొలగించి, క్లోరినేషన్ మరియు బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగిందన్నారు. కాలువలను శుభ్రం చేయడంతో పాటు, కాలువలకు ఇరువైపుల ఉన్నటువంటి పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ, కరోనా వైరస్ నియంత్రణ కు సహకారం అందించాలని పంచాయతీ ప్రజలకు పిలుపునిచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప, తమ తమ ఇళ్ల నుండి ఇ బయటకు రాక పోవడమే మంచిది అన్నారు. ఒకవేళ రావాల్సి వస్తే తప్పనిసరిగా మాస్కులు ధరించి, శానిటైజర్ వాడుకోవాల్సి ఉందన్నారు. ప్రజలందరూ కరోనా వైరస్ నియంత్రణ నియమనిబంధనలను పాటించినట్లయితే, కరోనా వైరస్ త్వరగా నిర్మూలించ పడుతుందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# పారిశుద్ధ కార్మికులు కు నిత్యవసర సరుకులు పంపిణి

దర్శి ప్రకాశం జిల్లా దర్శి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా మంగళవారం దర్శి లో వైసీపీ నాయకులు మరియు బూచేపల్లి అభిమానులు సుబ్బారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి దర్శి నగర పంచాయతీ కార్మికులు కు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్మికులు వారికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో దర్శి మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూస వెంకటరెడ్డి, డాక్టర్ ఎస్ ఎమ్ బాషా, శీలం శ్రీనివాసులు రెడ్డి, నరేంద్ర,సుబ్బారెడ్డి, ఇత్తడి దేవదానం, వైసీపీ నాయకులు, బూచేపల్లి అభిమానులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన వేతనం

విజయవాడ, మే 11, (( విభారె) సేది ఒకటే పని.. కానీ, ఇచ్చే జీతాల్లో మాత్రం తీవ్రమైన వ్యత్యాసం! రెగ్యులర్ ఉద్యోగులతో సమానస్థాయిలో పని చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతం విషయం దగ్గరకు వచ్చే సరికి వారిలో కనీసం సగం కూడా ఉండదు. ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వారితో సమానంగా కనీస వేతనం చెల్లించాల్సిందేనని హైకోర్టు తీర్పు చెప్పింది. సమాన పనికి కనీస వేతనం కూడా చెల్లించకపోవడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం వివక్ష చూపడమేనని తేల్చి చెప్పింది.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో బాల్వాడీ టీచర్లుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం చెల్లించాలని పురపాలకశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే, తమ సర్వీసులను క్రమబద్ధీకరించేలా ఆదేశాలివ్వాలన్న బాల్వాడీ టీచర్ల అభ్యర్థనను మాత్రం తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి ఇటీవలే తీర్పు వెలువరించారు.జీవీఎంసీ పరిధిలో బాల్వాడీ టీచర్లుగా పనిచేస్తున్న తాము రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా.. తమకు కనీస వేతనాలు చెల్లించడంగానీ, తమ సర్వీసులను క్రమబద్ధీకరించడంగానీ చేయడం లేదంటూ జానపరెడ్డి సూర్యనారాయణ, మరో 49 మంది హైకోర్టులో గత ఏడాది పిటిషన్ దాఖలు చేశారు. మొదట్లో నెలకు రూ. 375 వేతనం ఇచ్చేవారని, తర్వాత దాన్ని రూ.1,300కు, 2016లో రూ.3,700కు పెంచారని పిటిషనర్ల న్యాయవాది తెలిపారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారికి కనీస వేతనం రూ.6,700గా నిర్ణయిస్తూ ప్రభుత్వం 2011లో జీవో ఇచ్చిందని పేర్కొన్నారు.అయితే, ఆ జీవో ప్రకారం కనీస వేతనం చెల్లించాలని మున్సిపల్ స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినా, జీవీఎంసీ అమలు చేయలేదని తెలిపారు. పిటిషనర్లు ఔట్‌సోర్స్ పద్ధతిలో ఓ ఏజెన్సీ ద్వారా నియమితులయ్యారని, అందువల్ల వారు సర్వీసు క్రమబద్ధీకరణకు అర్హులు కాదని జీవీఎంసీ న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి.. పిటిషనర్లు రెగ్యులర్ ఉద్యోగుల్లాగే 8 గంటలు పనిచేస్తున్నప్పుడు వారితో సమానంగా వేతనం పొందేందుకు అర్హులని తీర్పు చెప్పారు. వారికి కనీస వేతనాన్ని వర్తింపజేయాలని పురపాలకశాఖను ఆదేశించారు. పిటిషనర్లు ఎన్ఎంఆర్‌లుగా, రోజూవారీ వేతనాలు పొందేవారిగా నియమితులు కాలేదని, ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్స్ పద్ధతిలో నియమితులయ్యారని, సర్వీసు క్రమబద్ధీకరణ కోరజాలరని తీర్పులో పేర్కొన్నారు. దీంతో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న హైకోర్టు తీర్పు.. భవిష్యత్తులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పాలిట వరంగా మారనుంది.

# మార్మోగుతున్న రిజైన్ జగన్ హ్యాష్ ట్యాగ్

విజయవాడ, మే 11, ( విభారె) )కరోనా వైరస్ మహమ్మారి విలయతాండవం చేస్తున్న తరుణంలో.. తిరుపతి రుయా ఆస్పత్రిలో మరణమృదంగం మోగడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. సరైన వైద్య సదుపాయాలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో కోవిడ్ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తున్నారు. ఇలాంటి సమయంలో తిరుపతిలోని ఎస్‌వీఆర్ రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ సకాలంలో అందకపోవడంతో ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటన అందరినీ కలచివేస్తోంది. ఈ తరుణంలో రుయా ఘటనకు జగన్ ప్రభుత్వ అసమర్థతే కారణమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.రుయా ఘటనకు బాధ్యత వహించి వెంటనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ మేరకు సీఎం జగన్ రాజీనామా చేయాలంటూ ట్విట్టర్‌లో టీడీపీ, జనసేన కార్యకర్తలు, పలువురు నెటిజన్లు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ట్విట్టర్‌లో చఖీవబతిణనిఏజీణజీని హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది. మంగళవారం మధ్యాహ్నం 2.25 గంటలకు 24.1 వేల ట్వీట్లు చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం.. రుయా ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డులో ఆక్సిజన్ అందకపోవడంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఓ వారంలో ఇటువంటి సంఘటనలు మరికొన్ని చోట్ల కూడా జరిగాయి. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన నాయకత్వ లోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తిరుపతి రుయాలో మరణ మృదంగం మోగిందని ఓ నెటిజన్ ఆరోపించారు. తనకు కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంత బాధ్యతారహితంగా ఎలా వ్యవహరించ గలుగుతోందని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని సమర్థించేవారిపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్నారు.

## రసాయనిక గ్యాస్ లీక్?ముగ్గురు మృతి

నెల్లూరు నెల్లూరు జిల్లా వింజమూరు మండలంలోని చంద్రపడియాలో ఈ రోజు ఉదయం రసాయనిక పరిశ్రమలో గ్యాస్ లీకైంది. దీంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనలో అస్వస్థతకు గురైన మరొకరిని ఆసుపత్రికి తరలించిన సహాయక బృందాలు చికిత్స అందేలా చేశాయి. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గ్యాస్ లీక్ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్లోని పరిశ్రమల్లో తరుచూ గ్యాస్ లీక్ ఘటనలు చోటు చేసుకుంటుండడం కలకలం రేపుతోంది.

# కరోనా నుండి కోలుకున్నాక టూత్ బ్రష్ మార్చడాన్ని మరచిపోకండి... లేదంటే కరోనా నుండి తప్పించుకోవడం కష్టమే...



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చాలా మంది కరోనా బారిన పడుతున్నారు. అయితే మంచి విషయమేమిటంటే.. దాదాపు 90 శాతం మంది ఈ కోవిడ్-19 మహమ్మారి విజయవంతంగా కోలుకుంటున్నారు.అయితే కరోనా నుండి కోలుకున్నామని ఆనందపడే వారికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ముందుగా ఉదయాన్నే లేచి పళ్లను శుభ్రం చేసుకోవడానికి ఉపయోగించే టూత్ బ్రష్ ను తప్పనిసరిగా మార్చుకోవాలని చెబుతున్నారు. ఒకవేళ మీరు కోవిద్ నుండి కోలుకున్నాక టూత్ బ్రష్ మార్చడం మరచిపోతే మాత్రం మీరు మళ్లీ ఆ వ్యాధిన బారిన పడే ప్రమాదముందని చెబుతున్నారు. దీనికి సంబంధించిన అధ్యయనాలలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. కోవిడ్తో పోరాడటానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఆయుర్వేద స్వీయ సంరక్షణ చిట్కాలు అవి మార్చకపోతే.. అవి మార్చకపోతే.. కరోనా మహమ్మారి నుండి విజయవంతంగా కోలుకున్న వారు వెంటనే టూత్ బ్రష్ మార్చుకోవాలని దంతవైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ మీరు అలా చేయకపోతే.. కరోనా మళ్లీ సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మీ టూత్ బ్రష్ వల్ల మీకు తిరిగి కరోనా సోకడమే కాదు.. మీ కుటుంబ సభ్యులు కూడా దీంతో ఇబ్బంది పడొచ్చు. ఎందుకంటే సాధారణంగా ఫ్యామిలీలో ఉండే వారు ఒకటే వాష్ రూమ్ ను ఉపయోగిస్తుంటారు. టంగ్ క్లీనర్ కూడా.. టంగ్ క్లీనర్ కూడా.. దేశంలోని ప్రతిష్టాత్మక మీడియా సైట్లో ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, న్యూఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీకి చెందిన హెచ్ఓడి డెంటల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ మెహ్రా మాట్లాడుతూ కరోనా నుండి కోలుకున్నాక టూత్ బ్రష్ లు మాత్రమే కాకుండా టంగ్ క్లీనర్లను కూడా మార్చాలని చెప్పారు. ఎన్నిరోజుల తర్వాత మార్చాలి.. ఎన్నిరోజుల తర్వాత మార్చాలి.. నిపుణుల అభిప్రాయం ప్రకారం, సాధారణంగా మీ టూత్ బ్రష్ మరియు టంగ్ క్లీనర్ ను 20 రోజుల తర్వాత ఒకసారి మార్చాలి. అప్పుడే మీ నోట్లో దాగి ఉన్న వైరస్లు లేదా బ్యాక్టీరియాను తొలగించేందుకు దోహదపడుతుంది. ఒకవేళ మీకు ఇలా మార్చడం కుదరడానికి కష్టంగా అనిపిస్తే.. మీరు మీ నోట్లో ఉప్పు నీటితో పుకిలించడం ఉత్తమ మార్గం. దీని కోసం మీరు అనేక రకాల మౌత్ వాష్ ఉత్పత్తులు మార్కెట్లో సులభంగా లభిస్తాయి. కరోనా ఇన్ఫెక్షన్ సమయంలో కూడా తెలియకుండా ఈ ఆహారాలు తినవద్దు ...! బ్రెజిల్ అధ్యయనం.. బ్రెజిల్ అధ్యయనం.. ఈ ఏడాది జనవరిలో బ్రెజిల్ లోని పరిశోధకులు కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో నోటి పరిశుభ్రత ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఒక అధ్యయనం చేశారు. టూత్ బ్రష్ లను క్రిమి సంహారం చేయడం నోటి పరిశుభ్రతలో భాగంగా ఉండాలని అధ్యయనం సిఫార్సు చేసింది. ఎందుకంటే ఇది ఇన్ఫెక్షన్లు తగ్గించడంలో సహాయపడుతుంది. సులభంగా వ్యాప్తి.. అతను ఒక నెలకి రూ. 1,800,000 ఎలా సంపాదిస్తాడో చూడండి! ౧1 కోటి లైఫ్ కవర్ నెలకు ?593.00 ఆపై. మాక్స్ లైఫ్ టర్మ్ ఇన్సూరెన్స్ రూ. 10 లక్షల వరకు రుణం పొందండి, తక్షణ ఆమోదం. ఇప్పుడు అప్లై చేయండి! సులభంగా వ్యాప్తి.. ఈ అధ్యయనం జర్నల్ ఆఫ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ లో ప్రచురించబడింది. ఇందులో టూత్ బ్రష్ లు 'సూక్ష్మజీవుల జలాశయాలుగా పని చేస్తాయి'. ఇది వ్యాధి సోకిన వ్యక్తి నుండి ఇతరులకు సులభంగా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి మీరు కోవిద్-19 రోగులు కరోనా నుండి భద్రత కోసం టూత్ బ్రష్ మరియు టంగ్ క్లీనర్ ను ఆరబెట్టడం మరియు శానిటైజ్ చేయడం వంటివి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. గర్భిణీ స్త్రీలకు కరోనా వస్తే.. ఎలా కాపాడాలో తెలుసా.. శిశువుకు కూడా కోవిడ్-19 వస్తుందా? గాలి ద్వారా కరోనా : ఈ సూచనలు తప్పనిసరిగా పాటించాలి.. లేదంటే కష్టమే...! తిని ఎనీతిఇఒవ:కరోనా సోకినట్లు డౌటొస్తుందా? అయితే మీ గొంతులో ఈ మార్పులొస్తాయట...! ఊాఎఎఆ-19కు ముందు, తర్వాత.. కరోనా వేళ.. ఈ శ్వాస వ్యాయామాలతో కచ్చితమైన ఫలాలు..!!

## కెప్టెన్‌గా పంత్.. కోహ్లి, రోహిత్‌లకు దక్కని చోటు

ముంబై: మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఎంపిక చేసిన ఐపీఎల్ 2021 సీజన్ ప్లెయింగ్ ఎలెవెన్ జట్టులో ఎంఎస్ ధోని,విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రాలకు చోటు దక్కలేదు. ఐపీఎల్ 2021 సీజన్‌లో జరిగిన మ్యాచ్‌ల ఆధారంగా ఆకాశ్ చోప్రా ఈ జట్టుని ఎంపిక చేశాడు. ఈ జట్టుకు కెప్టెన్‌గా రిషబ్ పంత్.. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను ఎంపిక చేశాడు. మూడో స్థానంలో డుప్లెసిస్.. ఇక మిడిలార్డర్‌లో గ్లెన్ మాక్స్‌వెల్, ఏబీ డివిలియర్స్, రిషబ్ పంత్‌ను ఎంపిక చేశాడు. ఆల్‌రౌండర్ల కోటాలో రవీంద్ర జడేజా, క్రిస్ మోరిస్‌లను సెలెక్ట్ చేసిన చోప్రా.. మరో స్పిన్నర్‌గా రాహుల్ చాహర్‌ని తీసుకున్నాడు. ఇక పేస్ బౌలింగ్ విభాగంలో ఆవేష్ ఖాన్, హర్షల్ పటేల్‌కి చోటిచ్చాడు.ఇక ఐపీఎల్ 2021 సీజన్‌లో కేకేఆర్, ఢిల్లీ, సీఎస్‌కే, ఎస్ఆర్‌హెచ్ జట్టులో ఆటగాళ్లతో పాటు సిబ్బంది కరోనా బారిన పడడంతో లీగ్‌ను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. కాగా లీగ్‌లో 29 మ్యాచ్‌లు ముగియగా.. మరో 31 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.

# సోషల్ మీడియాను హీటెక్కిస్తున్న బోల్డ్ బ్యూటీ..!



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ దక్షా నగర్కర్.. ఇప్పుడు తెలుగు కుర్రకారుకు మోస్ట్ ఫేవరేట్ హీరోయిన్స్ లో ఒకటి. అయితే అందరూ హీరోయిన్స్ లాగే దక్షా కూడా సినిమా అవకాశం రాగానే ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. కానీ సినిమాల సెలక్షన్స్ విషయంలో మాత్రం చాలా తెలివిగా నిర్ణయాలు తీసుకుంటుంది. నిజానికి అమ్మడి అందానికి అవకాశాలు పుష్కలంగా వస్తున్నాయట. కానీ ఆవేశపడకుండా తన కెరీర్ కు ఉపయోగపడే సినిమాలే ఎంచుకుంటుంది. అయితే పాతికేళ్ల వయ్యారి 2015లో హోరాహోరి అనే సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలో అరంగేట్రం చేసింది. అంటే 19ఏళ్లకే అమ్మడు హీరోయిన్ అయిపోయింది. డైరెక్టర్ తేజ తెరకెక్కించిన హోరాహోరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ గా నిలిచింది.కానీ అంతకుముందే ఏకే రావు పీకే రావు అనే సినిమాలో సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్ పోషించింది. ఫస్ట్ సినిమా ఫ్లాప్ కావడంతో సెకండ్ సినిమాకు కాస్త టైం తీసుకొని హుషారు సినిమా చేసింది. ఈ యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మంచి హిట్ అవ్వడంతో అమ్మడికి అవకాశాలు బాగానే క్యూ కట్టాయట. కానీ అన్ని కాదని తనకు నచ్చిన తనకు ఇంపార్టెన్స్ ఉన్న సినిమాలే ఓకే చేస్తుంది. ఈ ఏడాది దక్షా నటించిన జాంబిరెడ్డి సినిమా థియేటర్లలో విడుదలైంది. హిట్ టాక్ తో మంచి కలెక్షన్స్ రాబట్టుకుంది. నిజానికి జాంబిరెడ్డి సినిమాలో దక్షా హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ పోషించింది. అయితే ఈ సినిమాలో అమ్మడు హీరోయిన్ కాకపోయినా.. హీరో స్నేహితురాలిగా నటించింది కాబట్టి సినిమా స్క్రీన్ టైం అంతా దక్షా కనిపిస్తుంది.అయితే దక్షా మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టీవ్. అందుకే ఎప్పటికప్పుడు లేటెస్ట్ గ్లామరస్ ఫోటోస్ పోస్ట్ చేస్తుంది. అలాగే ఎల్లప్పుడూ మినిమం గ్యారంటీ స్కిన్ షో చేస్తుంటుంది. ఎందుకంటే దక్షా అందాలను చూసి పిచ్చెక్కిపోయే కుర్రకారు లక్షల్లో ఉన్నారు. దక్షా చాలా బోల్డ్. అందుకే గ్లామర్ షో చేయడంలో వెనకడుగు వేయదట. తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలో దక్షా నిజంగానే మతులు పోగొడుతుందని చెప్పవచ్చు. స్టార్ హీరోయిన్ గా మారేందుకు దక్షాలో అన్ని సమపాళ్ళలో ఉన్నాయంటూ ఫ్యాన్స్ నేటిజన్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ డ్రెస్ లో వయ్యారి బోల్డ్ అందాలను కెమెరా ముందు పరిచి వేడెక్కిస్తోంది. ప్రస్తుతం ఆ పిక్ నెట్టింట వైరల్ అవుతోంది.

# 'అఖండ' ఆల్బం రెడీ.. పెద్దాయన పుట్టిన రోజు స్పెషల్ రిలీజ్





నందమూరి బాలకృష్ణ నటిస్తున్న అఖండ మూవీపై నందమూరి అభిమానులు చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. ఈమధ్య కాలంలో బాలయ్య నుండి వచ్చిన సినిమాల్లో దాదాపు ఎక్కువ శాతం నిరాశ పర్చినవే. దాంతో ఆయన సినిమాలంటే పెద్దగా బజ్ కూడా లేకుండా వచ్చేసి వెళ్లి పోయాయి. కాని సింహా మరియు లెజెండ్ వంటి సూపర్ హిట్ చిత్రాలతో వచ్చిన బాలయ్య బోయపాటి ద్వయం మళ్లీ అఖండ సినిమా తో రాబోతుండటం... దానికి తోడు సినిమా పోస్టర్ లు మరియు వీడియోలు సినిమా పై అంచనాలు పెంచేయడంతో విడుదల కోసం అంతా ఎదురు చూస్తున్నారు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఈ నెల చివరి వారంలో సీనియర్ ఎన్టీఆర్ జయంతి సందర్బంగా అఖండ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేది. కాని కరోనా సెకండ్ వేవ్ వల్ల మొత్తం తలకిందులు అయ్యింది.అఖండ సినిమా ను ఎన్టీఆర్ జయంతికి విడుదల చేయలేక పోయినా ఆ రోజున అభిమానుల కోసం సినిమా నుండి ఒక్క పాటను లేదా మొత్తం ఆల్బంను విడుదల చేయాలని భావిస్తున్నారు. థమన్ సంగీతాన్ని అందించిన అఖండ ఆల్బం మరో లెవల్ లో ఉంటుందనే నమ్మకంతో అభిమానులు ఎదురు చూస్తున్నారు. అల వైకుంఠపురంలో ఆల్బం తర్వాత థమన్ నుండి ఏ ఆల్బం వచ్చినా కూడా అంచనాలు భారీగా ఉంటున్నాయి. అఖండ ఆల్బంకు కూడా ఖచ్చితంగా థమన్ న్యాయం చేసి ఉంటాడని అంతా ఆశిస్తున్నారు.బోయపాటి ఈ సినిమాలో బాలయ్యను రెండు విభిన్న షేడ్స్ లో చూపించబోతున్నట్లుగా ఇప్పటికే క్లారిటీ వచ్చింది. రెండు షేడ్స్ లో ఒకటి కాస్త అటు ఇటుగా అఘోరా పాత్ర. ఆ పాత్రలో బాలయ్య లుక్ ఇప్పటికే వచ్చింది. ఆ గెటప్ తో బాలయ్య చెప్పిన డైలాగ్ అదిరి పోయింది. ఆ టీజర్ కు యూట్యూబ్ లో రికార్డు స్థాయి వ్యూస్ వచ్చాయి. తక్కువ సమయంలోనే 50 మిలియన్ ల వ్యూస్ ను దక్కించుకున్న టీజర్ గా అది నిలిచింది. అలాంటి సినిమా నుండి ఎన్టీఆర్ జయంతి సందర్బంగా పాటలను విడుదల చేయబోతున్నారనే వార్తలు నందమూరి అభిమానులకు ఆనందం కలుగజేస్తున్నాయి. పాటల విడుదల విషయమై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నారు.

# 'తిమ్మరుసు' చిత్రాన్ని ఏ వేదికపై విడుదల చేస్తారో..!

టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "తిమ్మరుసు". 'అసైన్మెంట్ వాలి' అనేది దీనికి ట్యాగ్ లైన్. 'కిర్రాక్ పార్టీ' ఫేమ్ శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్ హీరోయిన్ గా నటిస్తోంది. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లాయర్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నాడు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్ - టీజర్ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న




ఈ సినిమాని మే 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే కరోనా సెకండ్ వేవ్ విజృంభన కారణంగా సినిమాల విడుదలలు వాయిదా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో 'తిమ్మరుసు' కూడా పోస్ట్ పోన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.'తిమ్మరుసు' సినిమాతో హిట్ కొడతామని హీరో దర్శకనిర్మాతలు చాలా హోప్ తో ఉన్నారు. అయితే ఇప్పుడు కోవిడ్ కారణంగా థియేటర్స్ లో సినిమాలు రిలీజ్ అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. అందులోను థర్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేస్తుండటంతో థియేటర్లు ఓపెన్ చేసే సాహసం ఇప్పట్లో చేయకపోవచ్చు. ఈ నేపథ్యంలో 'తిమ్మరుసు' చిత్రాన్ని డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ చేస్తే బాగుంటుందని సినీ వర్గాల్లో మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే సత్యదేవ్ నటించిన '47 డేస్' 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' 'గువ్వ గోరింక' సినిమాలు ఓటీటీలో విడుదలై మంచి స్పందన తెచ్చుకున్నాయి. దీంతో సత్య దేవ్ ఓటీటీ స్టార్ హీరోగా మారిపోయాడు. అంతేకాక ప్రమోషన్ కంటెంట్ తో ఈ సినిమా మీద ఇండస్ట్రీలో పాజిటివ్ టాక్ బాగా నడుస్తోంది. ఇలాంటివన్నీ లెక్కలోకి తీసుకొని ఫ్యాన్సీ ఆఫర్ వస్తే ఓటీటీకి ఇచ్చేయడం మంచిదని అంతా సలహాలు ఇస్తున్నారు.కాగా 'తిమ్మరుసు' చిత్రాన్ని ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ మరియు ఎస్ ఒరిజినల్స్ బ్యానర్స్ పై మహేష్ కోనేరు - సృజన్ ఎరబోలు కలసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీ చరణ్ పాకల సంగీతం సమకూర్చగా.. అప్పు ప్రభాకర్ ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ అందించారు. ఇందులో బ్రహ్మాజీ - అజయ్ - ప్రవీణ్ - ఆదర్శ్ బాలకృష్ణ - ఝాన్సీ - వైవా హర్ష - సంధ్యా - జనక్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190